

## 'ఉక్కు'లో వీఆర్‌ఎస్ కోసం భారీగా దరఖాస్తులు

» ఇప్పటికే రెండు వేల మందికిపైగా దరఖాస్తు?

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఎస్ కోసం స్టీల్ ప్లాంటులో ఇప్పటివరకూ సుమారు రెండు వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. స్టీల్ ప్లాంటులో తొలిసారి 1,163 మందికి వీఆర్‌ఎస్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో విడత యాజమాన్యం అవకాశం కల్పించడంతో అత్యధికులు వీఆర్‌ఎస్ పట్ల ఆసక్తి చూపుతున్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉన్నప్పటికీ...ఇప్పటికే సుమారు రెండు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది.

# సీట్లు...పాట్లు

**విద్యా హక్కు చట్టం ప్రకారం ఈ ఏడాది పేద వర్గాలకు చెందిన 2,118 మంది పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో సీట్ల కేటాయింపు**



» రకరకాల కారణాలతో మోకాలడ్డుతున్న యాజమాన్యాలు
» తొలి విడతలో 882 మందికి అడ్మిషన్ ఇచ్చేందుకు నిరాకరణ
» విద్యా శాఖ ఆదేశాలు బేఖాతరు
» కఠినంగా వ్యవహరించాలంటూ తల్లిదండ్రుల డిమాండ్

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

'రామ్‌నగర్‌కు చెందిన రాజాన కుందన కృతిక్‌కు రెండో విడతలో చినవాల్తేరులోని కోటక్ స్కూలులో ఒకటో తరగతిలో విద్యా హక్కు చట్టం కింద ఉచిత సీటు వచ్చింది. బాలుడిని తీసుకుని తల్లి పాఠశాలకు వెళితే కంప్యూటర్ కోర్సు కోసం రూ.15 వేలు ఫీజు చెల్లిస్తేనే అడ్మిషన్ ఇస్తామని యాజమాన్యం చెప్పింది. కంప్యూటర్ ఫీజు ఏటా చెల్లించాలని చెప్పడంతో అంత స్థోమత లేక వెనక్కి వచ్చేశారు.'

'పెదగదిలికి చెందిన నక్కిన చరణ్‌తేజ ఎంవీపీ కాలనీలోని ఆళ్వార్‌దాసు పబ్లిక్ స్కూలులో ఒకటో తరగతిలో ఉచిత సీటు కేటాయించారు. దీంతో బాలుడిని తీసుకుని తల్లిదండ్రులు పాఠశాలకు వెళితే... ఇంటికి పాఠశాల మూడు కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉన్నందున ప్రవేశం ఇవ్వలేమని యాజమాన్యం చెప్పింది.'

కేంద్ర ప్రభుత్వం 2011లో తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యా శాఖ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. గత మూడేళ్ల నుంచి రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం అమలు అవుతోంది. అయితే కొన్ని పాఠశాలలు మాత్రం ఉచిత ప్రవేశాలకు మోకాలడ్డుతున్నాయి. విద్యా శాఖ అధికారులు జోక్యం చేసుకున్నా ససేమిరా అంటున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం విశాఖ జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల్లో సుమారు ఆరు వేల మంది ఆన్‌లైన్‌లో ఒకటో తరగతిలో ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం పేద వర్గాలకు చెందిన పిల్లలకు మాత్రమే సీట్లు కేటాయిస్తారు. విద్యార్థి నివసించే ఇంటి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోపు ఉన్న పాఠశాలలను మాత్రమే దరఖాస్తు సమయంలో ఎంపిక చేసుకోవాలి. ఈ విధంగా మొదటి విడత నిర్వహించిన లాటరీలో 3,100 మంది పిల్లలను అర్హులుగా గుర్తించి ఒకటో తరగతిలో సీట్లు కేటాయించారు. వీరిలో 2,118 మందికి ప్రైవేటు పాఠశాలలు ప్రవేశాలు కల్పించాయి. మరో 882 మందికి పలు కారణాలతో సీట్లు ఇవ్వడానికి ప్రైవేటు యాజమాన్యాలు నిరాకరించాయి. రెండో విడతలో లాటరీలో 613 మందికి సీట్లు కేటాయించగా, సుమారు 600 మందికి ఆయా పాఠశాలల యాజమాన్యాలు ప్రవేశాలు కల్పించాయి.

తొలివిడతలో సీట్లు వచ్చినా ప్రవేశాలు లభించని 882 లో చాలామంది పిల్లల తల్లిదండ్రులు విద్యాశాఖాధికారులను సంప్రతించారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలను అధికారులు ఫోన్‌లో కారణాలు అడిగి ప్రవేశాలు కల్పించాలని సూచించినా ఫలితం లేకపోయింది. విద్యార్థి ఇంటికి సీటు వచ్చిన పాఠశాల మూడు కిలోమీటర్ల కంటే పది మీటర్లు దూరం ... మిగతా 6వ పేజీలో

## నీటి సరఫరా కార్మికుల సమ్మె విరమణ

» వచ్చే నెల రెండో తేదీ నాటికి పెరిగిన జీతాలు ఇస్తామని మేయర్ పీలా హామీ
» హామీ అమలు చేయకపోతే మూడో తేదీ నుంచి మళ్లీ సమ్మెకు దిగుతామని యూనియన్ ప్రతినిధులు హెచ్చరిక
» నగరంలో పునఃప్రారంభమైన నీటి సరఫరా

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీతాల పెంపును అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 27 నుంచి సమ్మెకు దిగిన జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అవుట్‌సోర్సింగ్ కార్మికులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు శనివారం ప్రకటించారు. కాంట్రాక్టు ఉద్యోగులు మరియు లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావుతో మేయర్ పీలా శ్రీనివాసరావు శనివారం తన నివాసంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నీటి సరఫరా నిలిచిపోవడం వల్ల నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, యోగాంధ్ర కారణంగా కార్మికుల వేతనాల పెంపుపై దృష్టిపెట్టడానికి వీల్లేకుండా పోయిందని మేయర్ వివరించారు. తనకు వచ్చే నెల రెండో తేదీ వరకూ అవకాశం ఇవ్వాలని, అధికారులతో చర్చించి కౌన్సిల్ తీర్మానంలో పేర్కొన్నట్టుగా పెరిగిన జీతాలతో కూడిన బిల్లులను జూన్ నెలకు వర్తించేలా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణం సమ్మెను విరమించి విధుల్లో చేరాలని కోరారు. జనవరి నుంచి ఎరియర్స్‌ను కూడా నెల రోజుల్లోగా కార్మికులకు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులంతా తమ సమ్మెను తాత్కాలికంగా విరమించి విధుల్లో చేరడానికి సమ్మతించారు. రెండో తేదీలోగా హామీని అమలు చేయకపోతే మూడో తేదీ నుంచి తిరిగి పూర్తిస్థాయి సమ్మెలోకి వెళతామని ఆనందరావు స్పష్టం చేశారు. అనంతరం కార్మికులు యథావిధిగా తమ విధుల్లో ... మిగతా 6వ పేజీలో

# బాబ్జీ X మేయర్

**పెందుర్తి టీడీపీలో రచ్చకెక్కిన విభేదాలు**

» పరిశీలకుడి సమక్షంలోనే వాగ్వాదం
» పార్టీ సమావేశాలకు సంబంధించి తనకు సమాచారం ఇవ్వడం లేదని పీలా ఆరోపణ
» మేయర్‌గా పెందుర్తిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తనను ఆహ్వానిస్తున్నారా?...అని ప్రశ్నించిన బాబ్జీ
» ఇరువురికీ సర్దిచెప్పిన పరిశీలకుడు



పరిశీలకుడు కోరాడ రాజబాబు సమక్షంలోనే వేదికపై పీలా, బాబ్జీ వాగ్వాదం

పెందుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తి టీడీపీలో నెలకొన్న విభేదాలు రచ్చకెక్కాయి. గత కొంతకాలంగా అంతర్గతంగా కొనసాగుతున్న గొడవలు బహిర్గతమయ్యాయి. కార్యకర్తల సమక్షంలో నాయకులు వాగ్వాదానికి దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.

సంస్థాగత కమిటీల ఎన్నిక, నియామకం కోసం స్థానిక వెలమ భవన్‌లో శనివారం పెందుర్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ అధ్యక్షతన ఎన్నికల పరిశీలకుడు కోరాడ రాజబాబు సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, నగర పార్టీ ఉపాధ్యక్షుడు అవగడ్డ అప్పలనాయుడు, తదితరులు హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గండి బాబ్జీ, పరిశీలకుడు కోరాడ రాజబాబులు మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకునేలా కమిటీలు నియామకం జరుగుతుందన్నారు. అనంతరం మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతున్న సమయంలో ఇన్‌చార్జి బాబ్జీ నిలువరించడంతో వివాదం మొదలైంది.

### టీడీపీ ఇన్‌చార్జి బాబ్జీ వెర్సస్ మేయరు పీలా

పెందుర్తి నియోజకవర్గ సమావేశాలకు ఇన్‌చార్జి నుంచి తనకు కనీస సమాచారం లేదని మేయర్ పీలా ఆరోపించారు. 'కార్యకర్తలను సమన్వయం చేసుకునే బాధ్యత మీకు లేదా?, గతంలో ఎమ్మెల్యేగా కూడా చేశారు కదా. మీకంటే ముందే నగర పార్టీ అధ్యక్షుడుగా చేశాను. రాష్ట్ర పార్టీలో పలు పదవులు చేపట్టాను. ఇదేనా సీనియర్లకు ఇచ్చే గౌరవం'...అంటూ పీలా అసంతృప్తి వ్యక్తం చేశారు. పీలా వ్యాఖ్యలకు గండి బాబ్జీ బదులిస్తూ 'మేయర్‌గా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న నాకు ఏనాడైనా ఆహ్వానం అందిందా. నగరం వరకూ ఎందుకు?, కనీసం పెందుర్తిలోనైనా సమాచారం ఇవ్వక్కర్లేదా...ఇది సరైనదేనా, నువ్వు ఆలోచించుకోవాలి'...అన్నారు. దాంతో పీలా లేచి వేరే మైకు అందుకుని ప్రోటోకాల్ కార్యక్రమాలకు, పార్టీ కార్యక్రమాలకు ముడి పెట్టవద్దని, అక్కడ పిలవలేదని అక్కసుతో పార్టీ కార్యక్రమాలకు పిలవరా... అని ప్రశ్నించారు. ఇరువురి నడుమ వాదోపవాదాలు కొనసాగడంతో పరిశీలకుడు కోరాడ రాజబాబు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. దీంతో సభలో ఉద్రిక్తత తగ్గి సాధారణ స్థితి నెలకుంది. అంతకుముందు బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న తనకు పార్టీ కార్యక్రమాలకు ... మిగతా 6వ పేజీలో

## అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

» లంకెలపాలెం కూడలిలో రోడ్డు ప్రమాద ఘటనపై రవాణా శాఖాధికారుల రిపోర్టు



ప్రమాదానికి కారణమైన లారీ (ఫైల్ ఫొటో)

లంకెలపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలిలో ఈ నెల 23న చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదానికి అతి వేగం, డ్రైవర్ లక్కిరెడ్డి కోటిరెడ్డి నిర్లక్ష్యమే కారణమని రవాణా శాఖాధికారులు నిర్ధారించారు. విశాఖపట్నం పోర్టు నుంచి పప్పుల బస్తాలతో తెలంగాణాలోని సిద్ధిపేట వెళుతున్న లారీ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న మూడు కార్లు, ఆటో, కంటైనర్ లారీ, పలు ద్విచక్ర వాహనాలపై దూసుకువెళ్లడంతో పచ్చికూర గాంధీ, కొణతాల అచ్చెయ్యనాయుడు, వై.ఎర్రప్పడు అనే ముగ్గురు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాలాపు రామ్‌కుమార్, రేఖ అప్పలరాజు ఈ నెల 26న మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మరో 15 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం జరగడానికి గల కారణాలను తెలుసుకునేందుకు జిల్లా రవాణా శాఖాధికారి గోపిశెట్టి మనోహర్ రెండు రోజుల క్రితం లంకెలపాలెం జంక్షన్‌ను సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదం ... మిగతా 6వ పేజీలో

## మత్స్యావతారంలో జగన్నాథుడు



మహారాణిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి శనివారం మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. టౌన్ కొత్తరోడ్డులోని ఆలయం నుంచి బలభద్ర, సుభద్ర సమేతంగా జగన్నాథ స్వామి విగ్రహాలను ప్రత్యేక రథంపై శుక్రవారం టర్నర్‌చౌల్ట్రీలోని గుండిచా మందిరానికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇక్కడ స్వామి దశావతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొలిరోజు మత్స్యావతారంలో అలంకరించారు. ఉదయం స్వామివారికి విశేష అర్చనలు, సహస్ర నామార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ వినాయక దేవస్థానం తరఫున వ్యవస్థాపక సభ్యులు టి.ఆర్.చోళన్, ఈవో డీవీవీ ప్రసాద్, టి.రాజేశ్వరన్‌లు జగన్నాథ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తుల కోసం ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి అన్న సమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

## తహశీల్దార్ల బదిలీల్లో మార్పులు

» ఆనందపురం తహశీల్దారుగా శ్రీవల్లి
» సీతమ్మధార తహశీల్దార్‌గా ఎంవీవీ ప్రసాద్
» పెందుర్తి, గాజువాక డీటీలకు తహశీల్దారు బాధ్యతలు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో తహశీల్దారు కేడర్ బదిలీల్లో కొన్ని మార్పులు చేశారు. గాజువాక తహశీల్దారు తేట శ్రీవల్లిని గతంలో వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహశీల్దార్‌గా బదిలీ చేశారు. ఇప్పుడు ఆమెను ఆనందపురం తహశీల్దారుగా నియమించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వచ్చిన ఎంవీవీ ప్రసాద్‌ను గతంలో కలెక్టరేట్‌లో నియమించారు. ఇప్పుడు సీతమ్మధార తహశీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పెందుర్తి తహశీల్దారుగా బదిలీ అయిన టి.రామకృష్ణను వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహశీల్దారుగా, విజయనగరం జిల్లా నుంచి విశాఖ జిల్లాకు కేటాయించిన బి.గురుమూర్తిని కలెక్టరేట్‌లోని భూ పరిరక్షణ విభాగం ... మిగతా 6వ పేజీలో

# రైల్వే జీఎంకు సౌత్ సెంట్రల్ బాధ్యతలు

**మూడు నెలలు అక్కడ పనిచేయాల్సిందే...**

» ఆగస్టు నుంచి ఇక్కడ జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడం అనుమానమే
» విశాఖ జోన్ పనులు ఆలస్యం కావడానికి ఒడిశా అధికారులు కావాలనే ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారని రైల్వే వర్గాల ఆరోపణ



సందీప్ మాథుర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా జోన్‌కు ఇటీవలె జనరల్ మేనేజర్‌గా నియమితులైన సందీప్ మాథుర్‌కు ఇప్పుడు అదనపు బాధ్యతలు అప్పగించారు. సికింద్రాబాద్ కేంద్రంగా నడుస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తుండడంతో ఆ జోన్ బాధ్యతలు సందీప్ మాథుర్‌కు అప్పగిస్తూ రైల్వే బోర్డు డైరెక్టర్ రవీందర్ పాండే ఉత్తర్వులు జారీ చేశారు. ఇది పేరుకు అదనపు బాధ్యతలే కానీ పూర్తి ఆపరేషన్‌లో ఉన్న ఆ జోన్‌ను సమర్థంగా నడిపించాల్సి ఉంటుంది. అందుకని కనీసం వారంలో నాలుగు రోజులు అక్కడ ఉండాల్సి వస్తుంది. ఇటు చూస్తే ఇక్కడ జోనల్ కార్యాలయం లేదు. నిర్మాణ పనులు ఇప్పుడే ప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయి ఆపరేషన్ ప్రారంభం కాలేదు. ఆగస్టు 15 నుంచి పూర్తిస్థాయిలో జోన్ పనిచేస్తుందని ఈ ప్రాంత పార్లమెంటు సభ్యులకు ఢిల్లీ పెద్దలు హామీ ఇచ్చారు. ఇంకో రెండు నెలలే కదా?...అనుకున్నారు. ఇప్పుడు పక్క జోన్ బాధ్యతలు అప్పగించడంతో జీఎం సందీప్ మాథుర్ విశాఖపట్నం కంటే సికింద్రాబాద్‌లోనే ఎక్కువ కాలం ఉండాల్సి ఉంటుంది. అక్కడ కొత్త జీఎంను నియమించేంత వరకు కనీసం మూడు నెలలు అదనపు బాధ్యతలు నిర్వహించాలని రవీందర్ పాండే తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంటే సెప్టెంబరు నెలాఖరు వరకూ అక్కడే ఉండాలి. అప్పటికి కూడా కొత్త జీఎంను నియమించకపోతే ఇంకా కొనసాగాల్సి ఉంటుంది. ఈ అదనపు బాధ్యతలతో విశాఖ జోన్‌కు కొత్త జీఎంను నియమించారనే ఆనందం ఆవిరైపోయింది. ఒడిశా అధికారులు కావాలనే విశాఖ జోన్ పనులు ఆలస్యం కావడానికి ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారని రైల్వే వర్గాలు ఆరోపిస్తున్నాయి. కొత్త జోన్‌ను ఒక మార్గంలో నడిపించడానికి పూర్తి స్థాయిలో పనిచేయాల్సిన జీఎంకు అత్యంత కీలకమైన జోన్ బాధ్యతలు అదనంగా అప్పగించడం ఏ విధంగాను సమంజసం కాదని రైల్వే ఉద్యోగులు వాదిస్తున్నారు. ఏదేమైనా జీఎం సందీప్ మాథుర్ విశాఖ జోన్‌ను నిర్లక్ష్యం చేయకుండా వారంలో కనీసం మూడు రోజులు ఇక్కడకు వచ్చి జోనల్ కార్యాలయం నిర్మాణ పనులతో పాటు ఇతర వ్యవహారాలను పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంపు

» వచ్చే నెల 17వ తేదీ వరకూ అవకాశం
» జిల్లాల వారీగా సలహాల స్వీకారం
» విశాఖ రానవసరం లేకుండా స్థానికంగానే ఏర్పాట్లు



విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) రూపొందించిన మాస్టర్ ప్లాన్-2041పై అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంచినట్టు చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు శనివారం తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌పై అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత దీనిని సమీక్షించాలని నిర్ణయించింది. ఈ మేరకు నష్టపోయిన వారి నుంచి అభ్యర్థనలు, ఇతరుల నుంచి సలహాలు స్వీకారానికి వీఎంఆర్‌డీఏ పిలుపునిచ్చింది. మే 22వ తేదీ నుంచి జూన్ 21 వరకు గడువు ఇచ్చారు. సుమారు రెండు వేల అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇచ్చిన సమయం సరిపోలేదని, గడువు ఇంకా పెంచాలని పలువురు కోరిన నేపథ్యంలో ప్రభుత్వ అనుమతితో ఈ గడువును జూలై 17వ తేదీ వరకు పొడిగించారు.

### జిల్లాల వారీగా స్థానికంగా స్వీకారం

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ పరిధి విశాఖపట్నం జిల్లాతో పాటు అనకాపల్లి, విజయనగరం వరకు ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు అభ్యంతరాలు సమర్పించడానికి ఇక్కడవరకూ రానవసరం లేకుండా స్థానికంగానే ఏర్పాట్లు చేశారు. దీనికి ప్రత్యేకంగా కొన్ని తేదీలు కేటాయించారు. ఆ రోజుల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా దగ్గరుండి స్వీకరిస్తారు.

- అనకాపల్లి, పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల ప్రజల నుంచి జూన్ 30, జూలై 1 తేదీల్లో అనకాపల్లి ఆర్‌డీఓ కార్యాలయంలో అభ్యంతరాలు తీసుకుంటారు.
- పెందుర్తి, గాజువాక నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 3, 4 తేదీల్లో, విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 7, 8 తేదీల్లో, విశాఖ తూర్పు, భీమిలి నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 10, 11 తేదీల్లో సిరిపురం వీఎంఆర్‌డీఏ భవనంలోని ... మిగతా 6వ పేజీలో

## ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ, రోబోటిక్స్ ల్యాబ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. పక్కన సైయెంట్ సంస్థ ప్రతినిధులు.

» రూ.8 కోట్లతో ఏర్పాటుచేయబోతున్న 'సైయెంట్'
» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో రూ.8 కోట్లతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ లేబొరేటరీలు ఏర్పాటు చేయడానికి 'సైయెంట్' సాఫ్ట్‌వేర్ కంపెనీకి చెందిన సైల్ ఫౌండేషన్ ముందుకు వచ్చినట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని తన గృహంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. 50 ప్రభుత్వ పాఠశాలల్లో ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకూ 25 వేల మంది విద్యార్థులకు ఆ అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. భీమిలి నియోజకవర్గంలో 28 పాఠశాలల్లో జూలై రెండో వారంలో ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. శిక్షణ ఫలితాలు చూసి దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సంస్థ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఏఐ లేబొరేటరీల నిర్వహణ భాగస్వామి గణేశ్, ఫౌండేషన్ ఫైనాన్స్ మేనేజర్ పీవీఎస్ శర్మ పాల్గొన్నారు.


ఆలయంలో భక్తులు

## అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, జూన్ 28 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి కూడా భక్తులు సూర్యోదయానికి ముందే కొండదిగువ తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. తొలుత పుష్కరిణిలో స్నానాలు చేసి భైరవస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి సింహగిరికి చేరుకుని అప్పన్న స్వామివారిని దర్శించుకున్నారు.

## నేడు సత్యసాయి సేవా సమితి వార్షికోత్సవం

భీమునిపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మోతీలాల్ వీధిలో వున్న భగవాన్ సత్యసాయి సేవా సమితి 23వ వార్షికోత్సవం ఆదివారం జరగనున్నట్టు మందిరం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 4.45 గంటలకు 21 సార్లు ఓంకారం, సుప్రభాతం, 5 గంటలకు నగర సంకీర్తన, 6 గంటలకు పాలాభిషేకం, 7 గంటలకు సాయి పతాకావిష్కరణ, 10 గంటలకు రుద్రాభిషేకం జరుగుతాయన్నారు. అలాగే సాయంత్రం సాయి పల్లకీ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

## 'ప్రతిపక్ష పార్టీలపై అధికారుల చిన్నచూపు'

భీమునిపట్నం (రూరల్), జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అధికారులు ప్రతిపక్ష పార్టీల నాయకులను చిన్న చూపు చూస్తున్నారని, అధికారిక కార్యక్రమాలకు కనీస సమాచారం ఇవ్వడం లేదని మండల వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు ఆరోపించారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. పంచాయతీల్లో జరుగుతున్న అధికారిక కార్యక్రమాల గురించి ఆ పంచాయతీల్లో ఉంటున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు తెలియజేయడం లేదని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యే పర్యటనల సమయంలో కూడా సమాచారం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలు చెబుదామన్నా.. ఫోన్లు ఎత్తడం లేదని ఆరోపించారు. అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

## కార్మికుల సమ్మెకు సీపీఐ మద్దతు

తగరపువలస, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం కార్మికులు చేస్తున్న సమ్మెకు భీమిలి సీపీఐ ఏరియా కమిటీ మద్దతు ప్రకటించింది. ఈమేరకు శనివారం తగరపువలసలోని పార్టీ కార్యాలయంలో ఏరియా కమిటీ కార్యదర్శి కె.రాంబాబు అధ్యక్షతన నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్యం, తాగునీరు వంటి అత్యవసర విషయాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు అప్పలరాజు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు

సాగర్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో తిమ్మాపురం నుంచి రుషికొండ వైపు వస్తున్న కారు ఐటీ జంక్షన్, పెద్ద రుషికొండ మధ్యలో ఉన్న డివైడర్‌ను శుక్రవారం అర్ధరాత్రి ఢీకొంది. ప్రమాద సమయంలో కారులో నలుగురు ఉన్నట్టు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.

## 9న కార్మిక సంఘాల సమ్మె

పద్మనాభం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘాల పిలుపుమేరకు వచ్చేనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను ప్రజలు విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. శనివారం వారు పలు గ్రామాల్లో సమ్మె గురించి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్మికులపై పనిభారం మోపుతున్నాయని ఆరోపించారు. హక్కుల సాధన కోసం తలపెట్టిన ఈ సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, సీఐటీయూ నాయకులు మూర్తి, నరసింగరావు. అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రసాదాల తయారీలో నాణ్యత పాటించాలి'


అధికారులకు సూచనలిస్తున్న ఈఓ త్రినాథరావు

సింహాచలం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ప్రసాదాల తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని పోటు సిబ్బందిని ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశించారు. శనివారం ఆయన అన్నప్రసాద భవనం పరిసరాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ప్రవేశపెట్టిన ఐవీఆర్ఎస్ ద్వారా భక్తులు నిత్యం తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారని వారి, నుంచి అసంతృప్తి రాకుండా ఉండాలంటే ప్రసాదాల తయారీలో సిబ్బంది అప్రమత్తతతో మెలగాలని సూచించారు. ప్రసాదాల తయారీకి ప్రస్తుత ఉన్న భవనం సరిపడడం లేదని, త్వరలో నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఆనందకుమార్, పిల్లా శ్రీనివాసరావు, డీఈఈ రామరాజు (హరి), ఏఈ లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణ

... 5వ పేజీ తరువాయి

మూడో అంతస్థులో దరఖాస్తులు తీసుకుంటారు.

- ఎస్.కోట, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 14, 15 తేదీల్లో విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో అభ్యంతరాలు తీసుకుంటారు.
- జూలై 16, 17 తేదీల్లో ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు కలిసి ఏ జిల్లాల వారు వచ్చినా అభ్యంతరాలు స్వీకరిస్తారు.

## బాజ్జీ వర్సెస్ మేయర్

... 5వ పేజీ తరువాయి

సంబంధించి ఇన్‌చార్జి నుంచి సమాచారం లేదని కరక దేవుడు ఆరోపించారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, యని, ఇప్పుడు కనీస ప్రాధాన్యం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

### పార్టీలో ఇవన్నీ సహజం

అనంతరం పరిశీలకుడు కోరాడ రాజబాబు మాట్లాడుతూ టీడీపీ అంతా ఒక కుటుంబమని, పార్టీలో అసంతృప్తులు సహజమని అన్నారు. అన్నీ సరిదిద్దుతాం, కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తామని అన్నారు. మండల, వార్డులకు సంబంధించి 15 మందిని సమన్వయకర్తలుగా నియమించామన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.శనివారం ఆయన ఆనందపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తాను రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వంతో పీఎం ఉషా పథకం కింద కళాశాల భవనాల నిర్మాణానికి రూ. 4.5 కోట్లు మంజూరు చేయించానని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని సూచిస్తూ, అందుకు అవసరమైన నిధులను దాతలు, పరిశ్రమల నుంచి సమకూర్చాలని అధికారులకు సూచించారు.విద్యాభివృద్ధికి మంత్రి లోకేశ్ చేపడుతున్న సంస్కరణలను మేధావులు కూడా ప్రశంసిస్తున్నారని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకూ విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను ముందుగానే ఇవ్వడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడానికి వీలుగా ఉంటుందని చెప్పారు. యోగాను పాఠ్యాంశాల్లో సబ్జెక్టుగా ప్రవేశపెట్టాలని భావిస్తున్నామని వెల్లడించారు. కాగా గంటా నారాయణమ్మ పేరిట డిగ్రీ కళాశాలలో గ్రంథాలయానికి భవనం నిర్మిస్తానని స్థానిక నాయకుడు ఘట్టంనేని సుభాష్ చంద్రబోస్ ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీవాణి, ఎంపీపీ మజ్జి శారదాప్రియాంక, సీనియర్ నాయకులు గంట్రెడ్డి స్వామినాయుడు, బమ్మిడి ఉమ, సర్పంచులు చందక లక్ష్మి, లోడగల రాజేశ్వరి రమణ, నాయకులు బీఆర్‌బీ నాయుడు, తాట్రాజు అప్పారావు, మీసాల సత్యనారాయణ, గంటా నూకరాజు, పాండ్రంగి అప్పలరాజు, కొట్యాడ రెడ్డిబాబు పాల్గొన్నారు.

### సమస్యలపై వినతి

లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలోని శ్రమజీవుల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు స్థానికులు వినతిపత్రం అందించారు. కాలనీలో సామాజిక భవనం, యోగా కేంద్రం, శ్మశానవాటికకు రోడ్డు వంటి సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కంచుబోయిన శ్రీను, పైడారాజు, గంగులు, అప్పలరామ్, తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్ రోడ్లు పరిశీలన


రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు


మధురవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6, 7 వార్డుల్లో ఉన్న రేవళ్లపాలెం, నగరంపాలెంలోని మాస్టర్ ప్లాన్ రహదారులను జీవీఎంసీ అధికారులు శనివారం పరిశీలించారు. గతంలో ఈ రహదారుల్లో తమ భూములు కోల్పోయామని కొందరు టీడీఆర్‌లు తీసుకున్నారు. టీడీఆర్‌లు తీసుకున్న వారిలో అర్హులు ఎందరు ? అధికారులు ఎంతమందికి టీడీఆర్‌లు ఇచ్చారు ? రహదారి విస్తరణ కోసం ఎంత ప్రైవేటు భూమిని సేకరించారు? వంటి వివరాలను జీవీఎంసీ సీసీపీ ప్రభాకర్ ఆధ్వర్యంలో సేకరించారు. రేవళ్లపాలెం రహదారిలో గతంలో కొందరికి ఇచ్చిన టీడీఆర్‌లను ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. మళ్లీ సమగ్ర సర్వే అనంతరం పక్కాగా అర్హుల జాబితాను సిద్ధం చేసి వారికి టీడీఆర్‌లు ఇవ్వనున్నట్లు తెలిసింది. మాస్టర్ ప్లాన్ సర్వే వివరాలు రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో వెలువడతాయని అధికారులు చెబుతున్నారు.

## జూలై నెలాఖరులోగా కార్మికులకు పరిహారాలు చెల్లింపు

**ఎమ్మెల్యే సమక్షంలో అంగీకరించిన చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం**


ఎమ్మెల్యే గంటాతో మిల్లు ప్రతినిధులు, కార్మిక నాయకులు

తగరపువలస, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు కార్మికులకు చెల్లించవలసిన పరిహారాలను జూలై నెలాఖరులోగా ఇస్తామని మిల్లు యాజమాన్య ప్రతినిధి కె.కె. బజోరియా హామీ ఇచ్చారు. శనివారం విశాఖలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో కార్మిక శాఖ అధికారులు మిల్లు యజమానులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిలు రావల్సిన కార్మికులు జూలై 2 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఇదే చివరి అవకాశమని చెప్పారు. కాగా పరిహారాల చెల్లింపు తర్వాత మాత్రమే మిల్లు ఆధీనంలో ఉన్న భూములను అమ్ముకోవడానికి వీలుగా అటాచ్‌మెంట్ తీసివేస్తారు. దీనికి యాజమాన్యం అంగీకారం తెలియజేసింది. ఈ సమావేశంలో కార్మిక శాఖ జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు, ఏసీపీ అప్పలరాజు, ఐక్య కార్యాచరణ కమిటీకి చెందిన నాయకులు నర్సింహరాజు, వెంకటరెడ్డి, వెంకటరమణ, కైలాస్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ, కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడయ్య, మద్దిల గురుమూర్తి, అచ్చారావు, నరవ రామారావు పాల్గొన్నారు.



## మత్స్యావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇంద్రద్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. తొలుత ఆలయ అర్చకులు తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం అర్చకుడు రొంపిచెర్ల లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు, శివ-కేశవ ఆలయాల సముదాయం ఎగ్జిక్యూటివ్ అథారిటీ సింగరాచార్యులు మత్స్యావతార విశిష్టతను భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 'ఇష్టంతో చదవండి'

భీమునిపట్నం (రూరల్), జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువుకోవాలని హైదరాబాద్‌కు చెందిన మోటివేషనల్ స్పీకర్ జరజాపు సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని చెప్పారు. అదే సమయంలో ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దంతంశెట్టి సత్యారావు, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, డొకర సత్యనారాయణ, విద్యా కమిటీ ఛైర్మన్ మొకర శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వరద పాయసం ఉత్సవం

సింహాచలం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలన్న సంకల్పంతో సింహగిరి ఈశాన్య మెట్లపై ఉన్న వైకుంఠవాసుని సన్నిధిలో ఆదివారం వరద పాయసం ఉత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు వైకుంఠ నారాయణుడి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పండితులు విరాట్ పర్వాన్ని పారాయణం చేసి, వరుణ జపం చేస్తారు. అనంతరం ఆలయానికి చేరువలో తయారు చేసిన పాయసాన్ని సమీపంలోని రాతిపై పోస్తారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సాగర్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ విజయ్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 48 ఖాళీలు ఉన్నాయన్నారు. కనీసం 40 శాతం దృష్టిలోపం ఉన్న వారు 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు గల బాలికలు అర్హులని తెలిపారు. ప్రవేశ సమయంలో సూచించిన వైద్య ధ్రువీకరణ, ఇతర పత్రాలను సమర్పించాలని చెప్పారు. విద్యార్థినులకు ఉచిత వసతి, భోజనం, ఆధునిక బ్రెయిలీ పరికరాలతో విద్య, కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతికతలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 90144 56753, 90597 71759 ఫోన్ నంబర్లలో గాని, పాఠశాలలో గాని సంప్రతించాలని ఆయన సూచించారు.

## ఆర్ఎంపీలకు బీమా సదుపాయం

భీమునిపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుల అసోసియేషన్ ఫ్యామిలీ మెంబర్స్ వేడుకలు శనివారం స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ మెడికల్ లీగల్ అడ్వయిజర్ డాక్టర్ ఎస్ఎల్ రావు మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేసే ఆర్ఎంపీలకు కూడా భద్రత ఉండాలన్న ఆలోచనతో బీమా సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివప్రసాద్, లోక్‌సత్తా రాష్ట్ర నాయకుడు భీశెట్టి బాబ్జి, మాతృభూమి సేవా సంఘం ప్రతినిధి గోపి, సాగరదుర్గ సింహాద్రి ఆస్పత్రి యాజమాన్య ప్రతినిధి గోపాలకృష్ణ, ఆరాధ్య అసోసియేషన్ వ్యవస్థాపకులు ఎన్. సుగుణేశ్వరి, ఉపాధ్యక్షులుమంగ శివప్రసాద్, కార్యదర్శి దొడ్డి అమిత్ కుమార్, కోశాధికారి రాజు, సంయుక్త కార్యదర్శి అను పాల్గొన్నారు.

## తుది విడత చందనం అరగదీతకు సన్నాహాలు

సింహాచలం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి తుది విడత చందనం సమర్పణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏటా తుది విడతగా మూడు మణుగుల చందనాన్ని స్వామివారికి ఆషాడ మాస పౌర్ణమినాడు (జూలై 10న) సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు చందన అరగదీతకు అవసరమైన ప్రత్యేక శిలలను శనివారం శుభ్రపరిచి బేడా మండపంలో ఏర్పాటు చేశారు. వచ్చేనెల 5వ తేదీ నుంచి చందనం అరగదీత ప్రారంభించనున్నట్టు స్థానాచార్యులు రాజగోపాల్ తెలిపారు.

## నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

మధురవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లులు చెల్లించే కేంద్రాలు ఆదివారం తెరిచే ఉంటాయని జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాధారణ సెలవు అయినప్పటికీ వినియోగదారుల సౌకర్యార్థం మధురవాడ, గోపాలపట్నం ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, రాజీవ్ ఈపీడీసీఎల్ కౌంటర్లు తెరిచే ఉంటాయని చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పద్మనాభం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సమయపాలన పాటించడం వల్ల చదువులో ఉత్తమ ఫలితాలు పొందడమే కాకుండా జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని ఫ్రీలాన్స్ ట్రైనర్ జరజాపు సురేశ్ చెప్పారు. రేవిడి హైస్కూల్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయం ఎంతో విలువైనదని, కాలాన్ని ఎవరూ వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శంకరరావు, ఉపాధ్యాయులు త్రివేణి, కిరణ్‌కుమార్, సోమవరాజు పాల్గొన్నారు.


స్వతంత్రనగర్ కాలనీలో ట్యాంకర్ కోసం ఎదురుచూస్తున్న మహిళలు

# రెండోరోజూ తాగునీటికి ఇక్కట్లు

మధురవాడ/సాగర్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది సమ్మె వల్ల మధురవాడ పరిసరాల్లో శనివారం కూడా కుళాయిలు నుంచి నీరు సరఫరా కాలేదు. గురువారం రాత్రి నుంచి కార్మికులు సమ్మె బాటపట్టిన విషయం తెలిసిందే. శుక్రవారం నీరు సరఫరా కాలేదు. శనివారం ఉదయం కార్మికులు సమ్మె విరమించి కొన్ని ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా సరఫరా చేశారు. స్వతంత్రనగర్ కాలనీ, వాంబే కాలనీ, నగరంపాలెం ప్రాంతాలకు ట్యాంకర్లు పంపించడంతో నీరు పట్టుకోడానికి మహిళలు ఖాళీ బిందెలు క్యూ కట్టారు. ట్యాంకర్ల ద్వారా కూడా అరకొరగానే నీరు అందడంతో కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండ ప్రాంతాల్లోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. కాగా ఆదివారం ఉదయం నుంచి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని జీవీఎంసీ అధికారులు తెలిపారు.


రివార్డులు అందుకున్నవారితో సీపీ శంఖబ్రతబాగ్చి

## 121 మంది పోలీసులకు రివార్డులు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ప్రతిభ చూపిన 121 మంది పోలీసులకు సీపీ శంఖబ్రతబాగ్చి శనివారం రికార్డులు అందజేశారు. మే నెలకు సంబంధించి విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డు స్థాయి నుంచి సీఐ స్థాయి వరకు సేవలను గుర్తించి రివార్డులు ఇచ్చారు.

## గ్రేడ్-2 వీఆర్వోలు బదిలీ

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోలు)కు బదిలీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, కలెక్టరేట్ పాలనాధికారి కేవీ ఈశ్వరరావు, అనకాపల్లి కలెక్టరేట్ ఏవో విజయకుమార్ శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో 2019లో నియమితులైన గ్రేడ్-2 వీఆర్వోలు పనిచేసే చోట ఐదేళ్లు పూర్తికావడంతో బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.ఈమేరకు విశాఖ జిల్లాలో 372 మంది, అనకాపల్లిలో 90 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారు. విశాఖ, అనకాపల్లి నుంచి 22 మందిని అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. అల్లూరి జిల్లాలో 49 మందికి పాడేరులో కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ చేశారు.

## ఆ 473 టన్నుల్లో 156 టన్నులు రేషన్ బియ్యం

- నాగపూర్‌కు చెందిన శ్రీరామా ఫుడ్ ఇండస్ట్రీస్ కంపెనీపై కేసు నమోదు
- జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్

విశాఖపట్నం, 28 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజుల క్రితం పోర్టు పరిధిలో పట్టుకున్న 473 టన్నుల బియ్యంలో 156 టన్నులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసినవిగా పరీక్షల్లో తేలింది. మిగిలిన 317 టన్నులు రేషన్ బియ్యం కావని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఆ 156 టన్నుల బియ్యం సీజ్ చేసి, నాగపూర్‌కు చెందిన శ్రీరామా ఫుడ్ ఇండస్ట్రీస్ కంపెనీపై 6-ఎ కింద కేసు నమోదుచేశామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రేషన్ బియ్యం పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి అవుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు చినములగాడ, షీలానగర్ పరిసరాల్లో గల ఫ్రైట్ కంటెయినర్ గోదాములో తనిఖీలు చేశారు. మొత్తం 473 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అందులో ఛత్తీస్‌గఢ్‌లోని పంచవటి టోలుగేటు ద్వారా నాలుగు లారీల్లో వచ్చిన 167 టన్నుల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసినవిగా నిర్ధారణ అయింది. వాటి విలువ రూ.47 లక్షలు. మిగిలిన 317 టన్నుల బియ్యం విడుదల చేశారు. కాగా రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని జేసీ మయూర్ అశోక్ హెచ్చరించారు.

## సీట్లు...పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఎక్కువగా ఉన్నా ప్రవేశాలు ఇవ్వలేదు. పేద వర్గాలకు చెందిన తల్లిదండ్రులకు దూరం విషయంలో అవగాహన ఉండదు. అయినప్పటికీ పిల్లలు పేద వర్గాలకు చెందినవారా?, కాదా?...అనేది పరిగణనలోకి తీసుకోకుండా కేవలం దూరాన్ని సాకుగా చూపి ప్రవేశాలు నిరాకరించడంపై విద్యా శాఖ వర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. అంతేతప్ప వారిపై గట్టిగా ఒత్తిడి తీసుకురాలేకపోతున్నాయి. ఇక కొన్ని పాఠశాలల్లో ప్రవేశ ఫీజు కాకుండా ఇతరత్రా ఫీజులు వసూలు చేస్తుండడంతో కొందరు పిల్లలు వెనక్కి వస్తున్నారు. ఉచిత ప్రవేశాలు పొందిన పిల్లల తల్లులకు తల్లికి వందనం సొమ్ములు జమ కావు. పిల్లలకు చెందిన సొమ్ము సంబంధిత పాఠశాల యాజమాన్యం ఖాతాకు జమచేస్తారు. అయితే గత ఏడాది పథకం అమలు చేయనందున కొన్ని పాఠశాలలు ఈ ఏడాది ప్రవేశాల విషయం కుంటిసాకులు చెబుతూ తప్పించుకున్నాయి. దీనిపై విద్యా శాఖ కఠినంగా వ్యవహరించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# తహశీల్దార్ల బదిలీల్లో మార్పులు

... 5వ పేజీ తరువాయి

స్పెషల్ తహశీల్దారుగా నియమించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఇచ్చిన ఆదేశాల మేరకు శనివారం రాత్రి డీఆర్వో ఉత్తర్వులు జారీచేశారు. గాజువాక, పెందుర్తిల్లో డీటీలుగా ఉన్న బి.శ్రీనివాస్, ఎ.సంతోష్‌లకు ఆయా మండలాల్లో తహశీల్దార్లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

### తహశీల్దారు కొలువుకు శ్రీవల్లి పట్టు

భూపరిపాలనా ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి రెండున్నరేళ్ల క్రితం విశాఖ జిల్లాకు వచ్చిన తోట శ్రీవల్లి పద్మనాభం, గాజువాకల్లో తహశీల్దారుగా పనిచేశారు. ఈనెల తొమ్మిదో తేదీన జరిగిన బదిలీల్లో ఆమెను గాజువాక నుంచి వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహశీల్దారుగా నియమించారు. ఆ పోస్టులో చేరేందుకు ఆమె ఇష్టపడలేదు. సీసీఎల్ఏ నుంచి వచ్చిన తాను తహశీల్దారు తప్ప ఇతర పోస్టుల్లో పనిచేస్తే సర్వీస్‌కు ఉపయోగపడదని చెబుతూ జిల్లాలో కీలకమైన ఆనందపురం మండలంలో అవకాశం దక్కించుకున్నారు. ఈ విషయంలో అమరావతి స్థాయి నుంచి ఒత్తిడి వచ్చినట్టు ప్రచారం సాగుతుంది.

## అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

జరిగిన తీరుపై పరవాడ పోలీసులతో మాట్లాడిన అనంతరం రవాణా శాఖ ఎంవీ ఇన్‌స్పెకర్లతో కూడిన బృందాన్ని నియమించారు. ఆ బృందం అన్ని అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్లనే పెనుప్రమాదం సంభవించిందని నిర్ధారించారు. స్థానిక పెట్రోల్ బంకు నుంచి లంకెలపాలెం జంక్షన్ వరకూ సుమారు అర కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా పల్లంగా ఉండడానికి తోడు డ్రైవర్ అధిక వేగంతో దూసుకురావడంతో వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగిందని, ఇది కేవలం డ్రైవర్ నిర్లక్ష్యమేనని తేల్చారు.

## నీటి సరఫరా కార్మికుల సమ్మె విరమణ

... 5వ పేజీ తరువాయి

చేరిపోవడంతో నగరంలో నీటి సరఫరా ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. కార్మికుల సమ్మె కారణంగా శుక్ర, శనివారాల్లో నగరంలోని అనేక ప్రాంతాలకు నీటిసరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. కాగా సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి సమ్మెకు దిగడంతో జీవీఎంసీ అధికారులతోపాటు మేయర్ పీలా శ్రీనివాసరావు దిగివచ్చి, హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇది కార్మికుల సమష్టి విజయమని చెప్పారు.

## పెదజాలారిపేటలో తాగునీటి కష్టాలు

**నీటి సరఫరా విభాగం సిబ్బంది సమ్మెతో ఇబ్బందులు**



నీటి ట్యాంకరు వద్ద బారులు తీరిన మహిళలు

పెదవాల్తేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ నీటి సరఫరా విభాగ కాంటాక్ట్ కార్మికుల సమ్మె కారణంగా గత రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పెదజాలారిపేటవాసులు ఇబ్బందికి గురయ్యారు. తాగునీటి కోసం ముఖ్యంగా వీధి కొళాయిలపై ఆధారపడే వారు అవస్థలకు గురయ్యారు. కొళాయిల్లో నీరు రాకపోవడంతో వీధుల్లో ఉండే బోరువెల్స్ వద్దకు క్యూ కట్టారు. అయితే జాలారిపేటలో చేతి బోర్లు తక్కువగా ఉండడంతో బిందెడు నీరు సంపాదించడానికి కూడా కష్టంగా మారిందని స్థానిక మహిళలు తెలిపారు. బాపూజీ నగర్, ఆదర్శ గ్రామం, గాంధీ బొమ్మ సెంటర్, ఓల్డ్ రమణ ముత్యాలమ్మ గుడి, ఎన్టీఆర్ విగ్రహం, రామాలయం వీధి, రాజశేఖర్ బొమ్మ, చేపల బజార్ తదితర ప్రాంతాల ప్రజలు గత రెండు రోజుగా తాగునీటి కోసం ఇబ్బంది పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న జీవీఎంసీ 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్న, టీడీపీ వార్డు నాయకులు తేడ్డు రాజు జీవీఎంసికి చెందిన పది వాటర్ ట్యాంకర్లు రప్పించారు. ట్యాంకుల దగ్గర ఉంటూ తోపులాట లేకుండా నీళ్లను పట్టుకునేలా చర్యలు తీసుకున్నారు.



## విదేశాల్లో పూర్వ విద్యార్థి సంఘాల కేంద్రాలు : ఏయూ వీసీ



వీసీ రాజశేఖర్‌తో ధ్రువీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో పూర్వ విద్యార్థుల సంఘం ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ తెలిపారు. శనివారం సాయంత్రం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్), ఏయూ సంయుక్తంగా నిర్వహించిన ఎగ్జిట్ ఎంగేజ్‌మెంట్ ఈవెనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

అనంతరం వీసీ మాట్లాడుతూ ఏయూతో విదేశీ విద్యార్థుల ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకువచ్చిందని చెప్పారు. కలిసి పనిచేయడం, ఆలోచనలు పంచుకోవడానికి మార్గం చూపిందన్నారు. పూర్వ విద్యార్థులు విదేశాల్లో ఏయూ ఖ్యాతిని పెంచేలా పనిచేయాలని సూచించారు. ఐసీసీఆర్ స్కాలర్‌షిప్ విభాగం డైరెక్టర్ సంజీవ్ వేది మాట్లాడుతూ ఏయూలో చదివిన విదేశీ విద్యార్థులు తమతో భారతీయతను తీసుకు వెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమం విభిన్న దేశాలతో భారత్‌కి ఉన్న స్నేహానికి మరింత విలువను జోడిస్తుందని చెప్పారు. ఐసీసీఆర్ సేవలు మరింత మందికి ఉపయోగపడేలా తెలియజేయాలని సూచించారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ 59 దేశాల నుంచి 1,100 మంది విదేశీ విద్యార్థులు ఏయూలో విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ఐసీసీఆర్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం అసోసియేట్ డీన్ ఎస్ఎం యుగంధర్ పాల్గొన్నారు. ఏయూ, విశాఖ నగరం, తెలుగు ప్రజలతో తమ అనుబంధాన్ని విదేశీ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అలుమ్ని రికార్డులు ప్రదానం చేశారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్స్ ఎ.నరసింహారావు, ఎంవీఆర్ రాజు, జి.గిరిజాశంకర్ పాల్గొన్నారు.

## పీవీకి ఘన నివాళి



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సోమయాజులు తదితరులు

సిరిపురం/రామ్‌నగర్ జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న పీవీ నరసింహారావు వంటి మహనీయులు భారతదేశంలో జన్మించడం ఈ దేశ ప్రజలు అదృష్టమని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ సోమయాజులు అన్నారు.శనివారం పీవీ 104వ జయంతిని పురస్కరించుకుని వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సిరిపురం గవర్నర్ బంగ్లా వద్ద పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల శాస్త్ర విద్యా పారంగతుడు దేశ విదేశాల ప్రజలచే పీవీ కొనియాబడటం దేశ గౌరవాన్ని మరింత పెంచిందన్నారు.మంచి రాజనీతిజ్ఞుడు, అపర చాణక్యుడు కావడంతో దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్న సమయంలో మైనారిటీ ప్రభుత్వాన్ని ఎంతో సమర్థవంతంగా పూర్తి కాలం నడిపించడమే కాకుండా ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది కేవీ రమ్మూర్తి, వుడా మాజీ చైర్మన్ పీఎస్ఎన్ రాజు, పారిశ్రామికవేత్త చెరువు రామకోటయ్య, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు వేదుల హనుమంతరావు, టేకుమళ్ల అరుణ్‌కుమార్, భాగవతుల శంకర్, శ్రీనివాస్, సాయిరామ్ సీవీఎస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### థైరాయిడ్ సమస్యతో కంటిచూపుపై ప్రభావం

ఆరిలోవ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : థైరాయిడ్ సమస్య శరీర బరువు, హార్మోన్ల అసమతుల్యతతో పాటు కంటి చూపును ప్రభావితం చేస్తుందని చాలా మందికి తెలియదు. గ్రంథులు సరిగా పని చేయని వారిలో కనిపించే ఒక రుగ్మత థైరాయిడ్ అని ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యశాల డాక్టర్ లావణ్య మద్ది తెలిపారు. ఈ వ్యాధి కళ్ల కండరాలను ఉబ్బేలా చేస్తుందని, ఫలితంగా కళ్లు పొడుచుకొని వచ్చినట్లు వెడల్పుగా తెరుచుకొని ఉంటూ తెల్లని భాగం అధికంగా కనిపిస్తుందన్నారు. తీవ్రమైన కేసులలో దృష్టిని కూడా కోల్పోతారని ఆమె తెలిపారు. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## నయనానందకరంగా చిన్నారుల నాట్య ప్రదర్శనలు



నాట్య పుష్కరాలు కార్యక్రమంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సాయిసురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 12వ వార్షికోత్సవంలో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నిర్వహించిన 'నాట్య పుష్కరాలు' కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ముద్దుముద్దులాడే చిన్నారులంతా తమ నాట్యాలతో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళలను ఒకే వేదికపై నాట్య రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో నాట్య కళలకు విశేష ఆదరణ ఉందన్నారు. చిన్నారులు నిర్వహించిన నృత్యాలు మైమరింపజేశాయని, చిన్నారులను ఇంత అద్భుతంగా తీర్చిదిద్దిన అకాడమీ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. తాము నేర్చుకున్న కళను భావితరాలకు అందించేందుకు అంకితభావంతో నిర్వాహకులు సాయి సురేఖ అట్టాడ, భాను రేఖ అట్టాడ చేస్తున్న కృషికి ఎంత పొగిడినా తక్కువేనన్నారు. కార్యక్రమంలో పలు నృత్య కళానిలయాల ప్రతినిధులు వసంత కిరణ్ రాయసం, కన్నాం వెంకట రమణారావు, జీవీఎంసీ జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, డాక్టర్ పసుమర్తి వెంకటరమణ, ఎస్ఎస్వీ సత్యభాను, బీఆర్ విక్రమ్‌గౌడ్, తాళ్లపాక సందీప్‌కుమార్, నూకాల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## 13వ వార్డులో అక్రమ నిర్మాణాలు తొలగింపు



రామకృష్ణాపురంలో తొలగించిన అక్రమ నిర్మాణాలు

ఆరిలోవ జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల రామకృష్ణాపురంలో పాత పందుల ఫారం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన 4 రేకుల షెడ్డులను శనివారం జీవీఎంసీ సిబ్బంది కూల్చి వేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసుల సహకారంలో రూరల్ మండల తహసీల్దార్ సమక్షంలో వీటిని తొలగించారు. సుమారు 60 మంది సిబ్బంది పాల్గొని ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎవరైనా ఎదురు తిరిగితే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెడతామంటూ హెచ్చరించారు. పాత ఇసుక రీచ్‌కు వెళ్లే రహదారంలో నిర్మించిన మూడు అక్రమ కట్టడాలను సైతం తొలగించారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పాల్ కిరణ్ హెచ్చరించారు. కార్యక్రమంలో జోన్-2 ఏసీపీ తిరుపతిరావు, వీఆర్వో దొర తదితరులు పాల్గొన్నారు.

### 9న సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ

మద్దిలపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను మున్సిపల్ కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. పిఠాపురం కాలనీలోని కామ్రేడ్ సీతారం ఏచూరి భవనంలో శనివారం నిర్వహించిన జోన్-3 జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభలో ఆయన మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను కాలరాస్తూ యజమాన్యాలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయించడమే యూనియన్ లక్ష్యమన్నారు. అలాగే రెగ్యులర్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మరణించిన,అనారోగ్యానికి గురైన కార్మికుల స్థానంలో వారి కుటుంబీకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలపై కౌన్సిల్‌లో హామీలు తప్ప అమలు చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా జోన్-3 పరిధిలోని పది వార్డుల్లో పోరాటాలు,విజయాలను కార్యదర్శి జేఏ నాయుడు ప్రవేశపెట్టారు. అనంతరం 22 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణారావు, అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్,కార్యదర్శి జేఆర్ నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.కుమారి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### సినిమా గైడ్

- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
- **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 26, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 34, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60,బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీర దోస 32, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)** (వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 580 |
| విజయనగరం | 584 |
| శ్రీకాకుళం | 584 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 80 |
| లైవ్ ధర | 100 |
| విత్ స్కిన్ | 170 |
| స్కిన్‌లెస్ | 180 |

## ఏయూ వర్సిటీ అభివృద్ధికి విక్రమ్‌దేవ్ వర్మ కృషి అమోఘం

**వీసీ రాజశేఖర్**



విక్రమ్‌దేవ్ వర్మకు నివాళులు అర్పిస్తున్న ఆయన కుటుంబ సభ్యులు, విజయనగర రాజ వంశీయులు, ఏయూ వీసీ రాజశేఖర్ తదితరులు

వెంకోజీపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూకు విరాళాలను అందించి వర్సిటీ అభివృద్ధికి జైపూర్ మహారాజు స్వర్గీయ విక్రమ్‌దేవ్ వర్మ చేసిన కృషి ప్రశంసనీయమని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ అన్నారు. శనివారం విక్రమ్ దేవ్ వర్మ 156 జయంతి సందర్భంగా.. ఏయూలోని భౌతికశాస్త్ర విభాగం వద్ద ఉన్న విక్రమ్‌దేవ్ వర్మ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ ఏయూకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన నిపుణులను ఆహ్వానించి తీసుకురావడానికి విక్రమ్‌దేవ్ వర్మ చేసిన కృషిని గుర్తు చేశారు. ప్రో చాన్సలర్‌గా ఆయన అందించిన సేవలు, సూచనలు వర్సిటీ అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయన్నారు. అలాగే సైన్స్ కళాశాల స్థాపనకు అవసరమైన నిధులను అందించడం, భౌతిక శాస్త్రం విభాగం భవనాన్ని నిర్మించడం వెనుక ఆయన అపార కృషిని కొనియాడారు. కార్యక్రమంలో విక్రమ్‌దేవ్ వర్మ కుటుంబ సభ్యులు రాణి మయాంక్ కుమారీదేవి, కుమారి లతికా దేవ్, జి.వివేక్, సీహెచ్ గిరిధర్, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, టీడీపీ నేతలు పి.అమరేందర్, విజయనగరం రాజ వంశీయులు మునీశ్ గజపతిరాజు, పొన్ను స్వామి, ఉత్కళ్ సమాజ్ ప్రతినిధి ఆర్ సాహూ, రెల్లి కుల రాష్ట్ర నేతలు ఐ.వెంకటేశ్వరరావు, చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార సవాళ్లను ఎదుర్కోగల థాట్ లీడర్లు అవసరం

**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు**



సెమినార్‌లో పాల్గొన్న ముత్యాలనాయుడు మేనేజ్‌మెంట్ విద్యార్థులు, అధ్యాపకులు

ఎంవీపీ కాలనీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార సవాళ్లను ఎదుర్కోగల థాట్ లీడర్ల అవసరం ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ సంప్రదాయక హద్దులను దాటి, గ్లోబల్ ఎకానమీలో ఇన్నోవేషన్, అడాప్టబిలిటీ, లీడర్‌షిప్‌పై దృష్టి సారిస్తోందన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాలలో 'మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో కెరీర్ అవకాశాలను అన్‌లాక్ చేయడం వంటి అంశంతో నైపుణ్యాలు, ట్రెండ్స్, మార్గాలు' అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ప్రధాన అతిథిగా ఎ హబ్ సీఈవో రవి ఈశ్వరప మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ భవిష్యత్ టెక్నాలజీ, మానవ కేంద్రిత లీడర్‌షిప్ కలయికతో ఉందన్నారు. యాక్సిస్ బ్యాంకు ప్రతినిధి వరుణ్ రవిపల్లి, ఐఐఎం డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ తదితరులు ప్రసంగించారు.

## వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ


రేషన్ సరఫరా చేస్తున్న డీలర్

డాబాగార్డెన్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 31వ వార్డులో డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాల్లోని వృద్ధులు, దివ్యాంగులకు ఐదు రోజులు ముందుగానే డీలర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ పంపిణీ చేస్తున్నారు. డిపోల వారీగా వృద్ధులు, దివ్యాంగులు వివరాలు డీలర్‌కు చేరడంతో, ఆయా ఇళ్లకు వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. తమ ఇంటి వద్దకే రేషన్ అందించడం పట్ల వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు విద్యుత్ బిల్లుల స్వీకారం

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చునని, ఇందుకోసం విశాఖపట్నం సర్కిల్ పరిధిలోని అన్ని కలెక్షన్ కౌంటర్లు పనిచేస్తాయని ఎస్ఈ జి.శ్యాంబాబు శనివారం తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, రాజీవ్ ఈపీడీసీఎల్ కౌంటర్లలోనూ బిల్లులు చెల్లించవచ్చునన్నారు.

## నేడు రైల్వే పెన్షనర్ల సంఘం ధర్నా

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ న్యూఢిల్లీ పిలుపు మేరకు రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం డీఆర్ఎం కార్యాలయం వద్ద మాస్‌ధర్నా నిర్వహించనున్నామని రైల్వే పెన్షనర్ల సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ధర్నా నిర్వహించి డిమాండ్లపై డీఆర్ఎం లలిత్ బొహ్రాకు వినతిపత్రం ఇస్తామన్నారు.

## సంజనా పుట్టాకు శోభానాయుడు పురస్కారం



డాబాగార్డెన్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ డా.శోభానాయుడు యువత పురస్కార్-2025ను కూచిపూడి నర్తకి సంజనా పుట్టాకు జూలై 5, 6 తేదీల్లో ప్రదానం చేయనున్నట్టు విశాఖలోని నటరాజ్ మ్యూజిక్ అండ్ అకాడమీ వ్యవస్థాపకుడు బీఆర్ విక్రమ్‌కుమార్ గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ కళాభారతిలో జరిగే సత్యభామ యువ నృత్యోత్సవం సందర్భంగా ప్రదానం చేస్తామన్నారు. సంజనా 12 సంవత్సరాలుగా కూచిపూడి నృత్యంలో సాధన చేస్తుందన్నారు.

## మళ్లింపు మార్గంలో హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సంబల్‌పూర్ డివిజన్‌లో ఆధునీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ-అమృత్‌సర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు (20807/20808) జూలై 1 నుంచి మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ నుంచి ప్రతి మంగళ, శుక్ర, శనివారాల్లో బయలుదేరే విశాఖ-అమృత్‌సర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20807) జూలై 1 నుంచి ఆగస్టు 30 వరకు, తిరుగు ప్రయాణంలో అమృత్‌సర్‌లో ప్రతి ఆది, బుధ, శని వారాల్లో బయలుదేరే అమృత్‌సర్-విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20808) జూలై 2 నుంచి ఆగస్టు 31 వరకు సర్లా జంక్షన్, సంబల్‌పూర్ సిటీ రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. అలాగే పూరి-రౌర్కెలా-పూరి ఎక్స్‌ప్రెస్ (18126/18125), భువనేశ్వర్-ఎల్‌టీటీ-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (12880/12879), పూరి-ఎల్‌టీటీ-పూరి ఎక్స్‌ప్రెస్ (22866/22865), పూరి-లాల్‌ఘర్-పూరి ఎక్స్‌ప్రెస్ (20472/20471), జోధ్‌పూర్-పూరి-జోధ్‌పూర్ (20814/20813) ఎక్స్‌ప్రెస్ రైళ్లు సర్లా జంక్షన్, సంబల్‌పూర్ సిటీ రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యాచకుడి మృతి


మువ్వ దుర్గాప్రసాద్ మృతదేహం

సీతంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డైమండ్ పార్కు సమీపంలో ద్వారకానగర్ రెండోలైనులో ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు ద్వారకా పోలీసులు తెలిపారు. హోటల్ రెడ్డం మేనర్ వద్ద గల ఫుట్‌పాత్‌పై శుక్రవారం రాత్రి కొందరు యాచకులు ఉన్నారు. ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌పై పడుకొని ఉన్నాడు. హోటల్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి వచ్చి బిచ్చగాళ్లను ప్రశ్నించి పడుకుని ఉన్న వ్యక్తి గురించి ఆరా తీసినప్పుడు..అతడు మువ్వ దుర్గాప్రసాద్ అని, పది రోజులుగా పచ్చ కామెర్లతో బాధపడుతున్నాడని తెలిపారు. కొద్దిసేపటి తర్వాత తోటి బిచ్చగాళ్లు దుర్గాప్రసాద్‌ను లేపగా చలనం లేకపోవడంతో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఫోనులో అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి దుర్గాప్రసాద్ మృతి చెందినట్లు తెలిపారు. ద్వారకా ఎస్ఐ ధర్మేంద్రకు విషయం తెలియడంతో అక్కడికి వెళ్లి విచారించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న ఈ వ్యక్తి వివరాలు తెలిసినవారు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర అతని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

# నీటి కోసం ఉరుకులు పరుగులు


మాధవధార పంప్‌హౌస్ వద్ద నీటిని పట్టేందుకు వచ్చిన ట్యాంకరు

మాధవధార, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నీటి సరఫరా అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె విరమణ సమాచారం తెలుసుకున్న ప్రజలు ఒక్కసారిగా ఉరుకులు, పరుగులు పెట్టారు. పంప్‌హౌస్‌లు రద్దీగా మారాయి. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, బర్మాక్యాంప్, మాధవధార ప్రాంతాలకు తాగునీరు సరఫరా అయ్యింది. జీవీఎంసీ జోన్-5 ఈఈ మురళీకృష్ణ, ఏఈ సుమన్ బ్లాక్ నంబర్ 22, 18, 19 పంప్‌హౌస్‌ల పరిధిలో నీటి సరఫరా పనులను పర్యవేక్షించారు. రెండు రోజులుగా విలవిలలాడుతున్న ప్రైవేటు ట్యాంకర్ల నిర్వాహకులు సమ్మె విరమణతో మాధవధార బ్లాక్ నంబర్ 22 పంప్‌హౌస్ దగ్గర వాహనాలతో క్యూ కట్టారు. కిలో లీటర్‌కు రూ.40 చెల్లించి 1 కె.ఎల్ వ్యాన్లు, 5 కె.ఎల్ లారీలలో నీటిని నింపి వెళ్లారు. ఇక్కడున్న రెండు ఫిల్లింగ్ స్టేషన్ల దగ్గర వాహనాల రద్దీతో ఆర్టీఏ కార్యాలయం దారంతా ట్యాంకర్లతో సందడి వాతావరణం నెలకొంది. రెండు రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో వచ్చిన నీటిని ప్రజలు నిల్వ చేసుకున్నారు.

### వాటర్ క్యాన్లకు డిమాండ్

**అక్కయ్యపాలెం:** నీటి సరఫరా విభాగం కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె తాత్కాలికంగా విరమించారు. కార్మికులు శనివారం ఉదయం పదిన్నర గంటల సమయంలో కొళాయిల ద్వారా నీరు సరఫరా చేశారు. కానీ కొద్ది సేపు మాత్రమే నీరు వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. నీటి సరఫరా విభాగం సిబ్బంది సమ్మె కారణంగా వాటర్ ప్లాంట్ల వద్ద క్యాన్లకు డిమాండ్ పెరిగింది. పలు ప్రాంతాల్లో ప్రజలు నీటి అవసరాలను తీర్చుకోవడానికి వాటర్ ప్లాంట్ల వద్ద క్యూ కట్టారు. కొత్త వాటర్ క్యాన్ రూ.250 మట్కా రూ.150, కొళాయి ఉన్న కొత్త క్యాన్ రూ.300, చిన్న క్యాన్ రూ.60కి విక్రయించారు. ఇదే అదనుగా చూసుకుని క్యాన్లను అధిక ధరలకు విక్రయించారు. పన్ను చెల్లించినా తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోయారు.


అక్కయ్యపాలెంలో నీరు పట్టుకుంటున్న దృశ్యం


వాటర్‌క్యాన్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

## 121 మంది పోలీసులకు రివార్డులు


రివార్డులు అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మే నెలలో విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 121 మంది పోలీసులకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం రివార్డులు అందజేశారు. హోంగార్డు నుంచి సీఐ స్థాయి వరకు చేసిన సేవలను గుర్తించారు. గంజాయి రవాణాకు అడ్డుకట్టవేయడం, చోరీ కేసుల దర్యాప్తు, నేరాలు జరగకుండా చాకచక్యంగా వ్యవహరించడం, వివిధ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని కేసులను ఛేదించడం వంటి అంశాల్లో వారు ప్రతిభ చూపారు. ప్రతిభావంతులకు రివార్డులు అందజేయడం వల్ల మిగిలినవారిలో స్ఫూర్తి నింపుతుందని సీపీ అభిప్రాయపడ్డారు.

## గ్రేడ్-2 వీఆర్వోల బదిలీ


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్వో

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా గ్రేడ్ -2 గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వోలు)ను బదిలీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానిశంకర్, కలెక్టరేట్ పాలనాధికారి కేవీ ఈశ్వరరావు, అనకాపల్లి కలెక్టరేట్ ఏవో విజయకుమార్‌లు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో 2019లో నియమితులైన గ్రేడ్-2 వీఆర్వోలుగా పనిచేసే చోట ఐదేళ్లు పూర్తి కావడంతో బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇంకా సచివాలయాల్లో సిబ్బందిని రేషనలైజేషన్ చేయడంతో మరికొందరు వీఆర్వోలకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లాలో 372 మంది, అనకాపల్లి జిల్లాలో 90 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 22 మందిని అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 49 మందికి శనివారం పాడేరులోనే కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేశారు.

## పోలీసులపై ఆరోపణలు సరికాదు: ఏసీపీ


వివరాలు వెల్లడిస్తున్న నరసింహమూర్తి

సీతంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని, రిపోర్టు ఇచ్చిన తరువాత చర్యలు తీసుకోలేదని కొన్ని సంఘాలతో కలిసి ఆరోపణలు చేయడం సరికాదని ఏసీపీ అన్నెపు నరసింహామూర్తి అన్నారు. శనివారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 28న మిరాజ్ థియేటర్ యాజమాన్యంపై అందులో పనిచేసిన కొందరు ఫిర్యాదు చేశారని, తరువాత వారే ఫిర్యాదును వాపసు తీసుకున్నారని పేర్కొన్నారు. అయినా తమకు అందిన ఫిర్యాదు మేరకు ఈ వివాదాన్ని లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. కులం పేరుతో దూషించినా పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు చేస్తున్నారని, ఎవరిపై ఆరోపణలు చేస్తున్నారో ఆమె కూడా ఎస్సీ అని ఏసీపీ గుర్తుచేశారు. తమను అడిగితే వివరాలు తెలియచేస్తామని, అంతే కాని తప్పుడు కథనాలతో ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు. వాస్తవానికి ఇది లేబర్ డిపార్ట్‌మెంట్ పరిష్కరించాలని, ఇందులో కులం ప్రసక్తి లేదన్నారు. ఈ కేసులో ఇరువురు ఎస్సీ, ఎస్టీలు ఉన్నందున దీనికి అట్రాసిటీ కేసు వర్తించదని వివరణ ఇచ్చారు. వివరాలు పూర్తిగా తెలుసుకోకుండా పోలీసులపై నిందలు వేయడం సరికాదన్నారు. సమావేశంలో నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

డాబాగార్డెన్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి హాని కలిగిస్తే చర్యలు తప్పవని 31వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి హెచ్చరించారు. 31వ వార్డు పరిధి డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు, బ్యానర్స్ పట్టుకుని ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సంచులు వాడకం ద్వారా అనేకమైన అనారోగ్యకరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. మూగజీవులకు ఏమైనా ఆహార పదార్థాలు పెట్టే సమయంలోని ప్లాస్టిక్ కలర్లు వాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలోని మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో శనివారం 'కళాశాల విద్యార్థినులలో మానసిక ఆరోగ్యం పెంపొందించడం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల బోటనీ విభాగాధిపతి డాక్టర్ నివేదిత మాట్లాడుతూ విద్యార్థినులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన క్లినికల్ సైకాలజిస్టు, స్ట్రీమ్ మేనేజింగ్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ పద్మాక్షి లోకేశ్ మాట్లాడుతూ భావోద్వేగ మేధస్సు, సమయాన్ని ప్రణాళికబద్ధంగా వినియోగించుకోవడం, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక సెల్ కన్వీనర్ ఎస్.అనురాధ, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ప్రశంస, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

కంచరపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈనెల 21వ తేది నుంచి ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్ శనివారంతో ముగిసింది. ఈ కౌన్సెలింగ్‌కు జిల్లాలో 4012 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కెమికల్ కళాశాలలో 1910 మంది అభ్యర్థులు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాళాశాలలో 2102 మంది హాజరయ్యారు. వీరి ధ్రువపత్రాలను అధికారులు పరిశీలన చేసి రిజిస్ట్రేషన్లు చేశారు. కౌన్సెలింగ్ పూర్తిచేసుకున్న అనంతరం అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు నమోదు చేయించుకున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో మొదటి ర్యాంకు నుంచి 90వేలు ర్యాంకు వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఎంచుకోగా, 29, 30 తేదీల్లో 90001 ర్యాంకు నుంచి ఆఖరి ర్యాంకు వరకు గల అభ్యర్థులు ఆప్షన్లు ఎంచుకుంటారు. జూలై 1వ తేది లోపు మార్పులు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. 3వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.రమణ తెలిపారు.

## విద్యార్థులకు భోజనం ప్లేట్ల పంపిణీ

కంచరపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ రాంజీ ఎస్టేట్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బీజేపీ వార్డు అధ్యక్షుడు గుణుపూడి అరుణ్ భోజనం ప్లేట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ కుమార్తె శ్యామలా దీపిక జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఈ వితరణ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో గుణుపూడి అరుణ, అధ్యాపకులు తదితరలు పాల్గొన్నారు.


ప్లేట్లు పంపిణీ చేస్తున్న అరుణ, అరుణ్‌బాబు, నాయకులు

## 'దేశవ్యాప్తంగా కులగణన నిర్ణయం శుభపరిణామం'


కొత్త కార్యవర్గాన్ని అభినందిస్తున్న వి.శ్రీనివాసరావు

మురళీనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర అధ్యక్ష, కార్యవర్గ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా మురళీనగర్ బిర్లా జంక్షన్‌లోని బొత్స స్క్వేర్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసులు, రాష్ట్ర యూత్ ఇన్‌చార్జి రాజేశ్ మాట్లాడారు. బీసీ వర్గాల ఉన్నతితో పాటు దేశ పురోగతికి దోహదం చేసే విధంగా జనగణన, కులగణన చేయాలనే ప్రధాని నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలపడం శుభసూచికమన్నారు. బీసీ వర్గాల ఉన్నతికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దేశ జనాభాలో సగభాగంగా ఉన్న బీసీ వర్గాలకు నామినేటెడ్ పోస్టులు కల్పించి ఉన్నత స్థానం ఇవ్వాలని అన్నారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, ఇన్‌చార్జిగా మురళీనగర్‌కు చెందిన బొత్స సురేశ్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామకృష్ణను నియమించారు.

## 473 టన్నుల్లో 156 టన్నులు రేషన్ బియ్యం

» నాగపూర్‌కు చెందిన శ్రీరామా ఫుడ్ ఇండస్ట్రీస్ కంపెనీపై కేసు నమోదు: జేసీ అశోక్

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం పోర్టు పరిధిలో పట్టుకున్న 473 టన్నుల బియ్యంలో 156 టన్నులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసినవిగా పరీక్షల్లో తేలింది. మిగిలిన 317 టన్నులు రేషన్ బియ్యం కావని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఆ 156 టన్నుల బియ్యం సీజ్ చేసి, నాగపూర్‌కు చెందిన శ్రీరామా ఫుడ్ ఇండస్ట్రీస్ కంపెనీపై 6-ఎ కింద కేసు నమోదుచేశామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రేషన్ బియ్యం పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి అవుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు చినములగాడ, షీలానగర్ పరిసరాల్లో గల ఫ్రైట్ కంటెయినర్ గోదాముల్లో తనిఖీలు చేశారు. మొత్తం 473 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అందులో ఛత్తీస్‌గఢ్‌లోని పంచవటి టోలుగేటు ద్వారా నాలుగు లారీల్లో వచ్చిన 167 టన్నుల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసినవిగా నిర్ధారణ అయింది. వాటి విలువ రూ.47 లక్షలు. మిగిలిన 317 టన్నుల బియ్యం విడుదల చేశారు. కాగా రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని జేసీ అశోక్ హెచ్చరించారు.

## 'ఆ భూములు రామ్‌దేవ్ బాబాకు కేటాయిస్తే అంగీకరించం'



విదసం ఐక్య వేదిక సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బూసి వెంకటరావు

సీతంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శారదా పీఠం భూమలు రామ్‌దేవ్ బాబాకు కేటాయిస్తే అంగీకరించే ప్రసక్తి లేదని, ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం విరమించుకోవాలని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రామాటాకీస్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'శారదా పీఠం భూములు రామ్‌దేవ్ బాబాకు ఇస్తారా?' అని సీఎంని ప్రశ్నించారు. 'అదే జరిగితే జగన్‌కు, మీకు ఏం తేడా ఉంద'ని అన్నారు. అప్పుడు భీమిలి మండలంలో శారదా పీఠానికి ఇచ్చి రద్దు చేసిన విలువైన భూముల కోసం రామ్‌దేవ్ బాబా ప్రయత్నిస్తున్నారని, ఈ భూములను అణగారిన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు కోసం విదసం పోరాడి కాపాడిందన్నారు. శారద పీఠానికి భూములు కేటాయించడం చట్ట విరుద్ధమని, ఈ విషయమై జగన్ ప్రభుత్వం తమతో ఏకీభవించిందని వెంకటరావు అన్నారు. ఇప్పుడు యోగా ముసుగులో ఈ భూములను రామ్‌దేవ్ బాబాకు ధారాదత్తం చేయడం నైతికత కాదని ఆయన విమర్శించారు. రామ్‌దేవ్ బాబా కార్యకలాపాల్లో నిజాయతీ లేదని సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టిన సంగతి రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని భూకేటాయింపు ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విదసం ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర కాలనీలో అన్న సమారాధన

అక్కయ్యపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 43వ వార్డు వేంకటేశ్వర కాలనీలో ఉన్న భూ సమేత వరద వేంకటేశ్వరస్వామి 19వ వార్షికోత్సవం సందర్భంగా వేంకట తారక రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## నీటి సరఫరా కార్మికుల సమ్మె విరమణ

(5వ పేజీ తరువాయి)

చేరిపోవడంతో నగరంలో నీటి సరఫరా ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. కార్మికుల సమ్మె కారణంగా శుక్ర, శనివారాల్లో నగరంలోని అనేక ప్రాంతాలకు నీటిసరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. కాగా సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి సమ్మెకు దిగడంతో జీవీఎంసీ అధికారులతోపాటు మేయర్ పీలా శ్రీనివాసరావు దిగివచ్చి, హామీలను అమలుకు హామీ ఇచ్చారన్నారు. ఇది కార్మికుల సమిష్టి విజయమని అభివర్ణించారు.

## బాబ్జీ వర్సెస్ మేయర్

(5వ పేజీ తరువాయి)

సంబంధించి ఇన్‌చార్జి నుంచి సమాచారం లేదని కరక దేవుడు ఆరోపించారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, యని, ఇప్పుడు కనీస ప్రాధాన్యం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

### పార్టీలో ఇవన్నీ సహజం

అనంతరం పరిశీలకుడు కోరాడ రాజబాబు మాట్లాడుతూ టీడీపీ అంతా ఒక కుటుంబమని, పార్టీలో అసంతృప్తులు సహజమని అన్నారు. అన్నీ సరిదిద్దుతాం, కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తామని అన్నారు. మండల, వార్డులకు సంబంధించి 15 మందిని సమన్వయకర్తలుగా నియమించామన్నారు.

## అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

జరిగిన తీరుపై పరవాడ పోలీసులతో మాట్లాడిన అనంతరం రవాణా శాఖ ఎంవీ ఇన్‌స్పెకర్లతో కూడిన బృందాన్ని నియమించారు. ఆ బృందం అన్ని అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్లనే పెనుప్రమాదం సంభవించిందని నిర్ధారించారు. స్థానిక పెట్రోల్ బంకు నుంచి లంకెలపాలెం జంక్షన్ వరకూ సుమారు అర కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా పల్లంగా ఉండడానికి తోడు డ్రైవర్ అధిక వేగంతో దూసుకురావడంతో వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగిందని, ఇది కేవలం డ్రైవర్ నిర్లక్ష్యమేనని తేల్చారు.

## మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంపు

(5వ పేజీ తరువాయి)

మూడో అంతస్థులో దరఖాస్తులు తీసుకుంటారు.

- ఎస్.కోట, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 14, 15 తేదీల్లో విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో అభ్యంతరాలు తీసుకుంటారు.
- జూలై 16, 17 తేదీల్లో చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు కలిసి ఏ జిల్లాల వారు వచ్చినా అభ్యంతరాలు స్వీకరిస్తారు.

## తహశీల్దార్ల బదిలీల్లో మార్పులు

(5వ పేజీ తరువాయి)

స్పెషల్ తహశీల్దారుగా నియమించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఇచ్చిన ఆదేశాల మేరకు శనివారం రాత్రి డీఆర్వో ఉత్తర్వులు జారీచేశారు. గాజువాక, పెందుర్తిల్లో డీటీలుగా ఉన్న బి.శ్రీనివాస్, ఎ.సంతోష్‌లకు ఆయా మండలాల్లో తహశీల్దార్లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

### తహశీల్దారు కొలువు కోసం శ్రీవల్లి పట్టు

భూపరిపాలనా ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి రెండున్నరేళ్ల క్రితం విశాఖ జిల్లాకు వచ్చిన తోట శ్రీవల్లి పద్మనాభం, గాజువాకల్లో తహశీల్దారుగా పనిచేశారు. ఈనెల తొమ్మిదో తేదీన జరిగిన బదిలీల్లో ఆమెను గాజువాక నుంచి వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహశీల్దారుగా నియమించారు. ఆ పోస్టులో చేరేందుకు ఆమె ఇష్టపడలేదు. సీసీఎల్ఏ నుంచి వచ్చిన తాను తహశీల్దారు తప్ప ఇతర పోస్టుల్లో పనిచేస్తే సర్వీస్‌కు ఉపయోగపడదని చెబుతూ జిల్లాలో కీలకమైన ఆనందపురం మండలంలో అవకాశం దక్కించుకున్నారు. ఈ విషయంలో అమరావతి స్థాయి నుంచి ఒత్తిడి వచ్చినట్టు ప్రచారం సాగుతుంది.

## సీట్లు...పాట్లు

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా ఉన్నా ప్రవేశాలు ఇవ్వలేదు. పేద వర్గాలకు చెందిన తల్లిదండ్రులకు దూరం విషయంలో అవగాహన ఉండదు. అయినప్పటికీ పిల్లలు పేద వర్గాలకు చెందినవారా?, కాదా?...అనేది పరిగణనలోకి తీసుకోకుండా కేవలం దూరాన్ని సాకుగా చూపి ప్రవేశాలు నిరాకరించడంపై విద్యా శాఖ వర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. అంతేతప్ప వారిపై గట్టిగా ఒత్తిడి తీసుకురాలేకపోతున్నాయి. ఇక కొన్ని పాఠశాలల్లో ప్రవేశ ఫీజు కాకుండా ఇతరత్రా ఫీజులు వసూలు చేస్తుండడంతో కొందరు పిల్లలు వెనక్కి వస్తున్నారు. ఉచిత ప్రవేశాలు పొందిన పిల్లల తల్లులకు తల్లికి వందనం సొమ్ములు జమ కావు. పిల్లలకు చెందిన సొమ్ము సంబంధిత పాఠశాల యాజమాన్యం ఖాతాకు జమ చేస్తారు. అయితే గత ఏడాది పథకం అమలు చేయనందున కొన్ని పాఠశాలలు ఈ ఏడాది ప్రవేశాల విషయం కుంటిసాకులు చెబుతూ తప్పించుకున్నాయి. దీనిపై విద్యా శాఖ కఠినంగా వ్యవహరించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సమ్మె విరమణతో ప్రారంభమైన నీటి సరఫరా

గోపాలపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగంలోని అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెను సమ్మె శనివారం విరమించడంతో నరవ గ్రామంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నుంచి నీటి సరఫరా ప్రారంభమైంది. నగర ప్రజల దాహార్తిని తీర్చే కీలకమైన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఇక్కడ ఉన్నాయి. 33 ఎంజీడీ, రైవాడ 15ఎంజీడీ, 42 ఎంఎల్‌డీ ప్లాంట్‌లు నరవలోనే ఉన్నాయి. పెందుర్తి నుంచి నగరానికి దాదాపుగా ఈ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నుంచే తాగునీరు సరఫరా జరుగుతుంది. ఈ ప్లాంట్లలో సుమారు 80 మంది సిబ్బంది రేయింబవళ్లు విధులు నిర్వహిస్తుంటారు. కాగా శుక్రవారం నుంచి తాగునీటి సరఫరా విభాగం కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు వెలవెలబోయాయి.

**మల్కాపురం:** తాగునీటి సరఫరా విభాగంలోని అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె విరమించడంతో శనివారం మధ్యాహ్నం పలు ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అయితే అన్ని ప్రాంతాలకూ నీటి సరఫరా జరగలేదు. ఆదివారం నుంచి అన్ని వార్డులకు యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంబంధిత సిబ్బంది తెలిపారు.

## బొర్రమాంబ పారాయణ సమితి వార్షికోత్సవం

అగనంపూడి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను చేపడుతున్న బొర్రమాంబ పారాయణ సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. జగన్నాథస్వామి ఆలయ ఈవో పద్మావతి పారాయణ సమితి చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం స్థానికంగా గల పలు ఆలయాల్లో మొక్కలు నాటారు. దేవస్థానం ట్రస్టు చైర్మన్ కరణం పైడిరాజు, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.






# శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు

» ఎప్పుడు కూలుతాయోనని భీతిల్లుతున్న ప్రజలు


86వ వార్డు పరిధి రాజీవ్ నగర్‌లో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు


87వ వార్డు సిద్దార్థ నగర్‌లో పాడైపోయిన వాటర్ ట్యాంకు


86వ వార్డు యాతపాలెంలో కూలడానికి సిద్ధంగా ఉన్న ట్యాంకు

కూర్మన్నపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్, యాతపాలెంతో పాటు 87వ వార్డు సిద్ధార్థ నగర్‌లో వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకులు పాడైపోవడంతో ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ వాటర్ ట్యాంకుల పైకి ఎక్కేందుకు, దిగేందుకు అవకాశం లేకపోవడంతో చాన్నాళ్లుగా వీటిని శుభ్రపరచడం లేదు. దీంతో వీటి ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిలో చెత్తాచెదారం, నలకలు, బురద నీరు వస్తుందని వుడానగర్, రాజీవ్‌నగర్, యాతపాలెం వాసులు చెబుతున్నారు. కలుషితమైన నీటిని తాగితే వ్యాధుల బారినపడతామని వాపోతున్నారు. కాగా సిద్ధార్థ నగర్‌లో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును ఇటీవలే కార్పొరేటర్ బొండా జగన్ తాగునీటి విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని, అలాగే ట్యాంకులను శుభ్రపరిచేలా చూడాలని స్థానికులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జగన్ హామీ ఇచ్చారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ విధానంలో సంస్కరణలతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 92వ వార్డు పరిధి ఇందిరానగర్‌లో భూగర్భ విద్యుత్ లైన్ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ విధానంలో ప్రజలకు మేలు చేకూరేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రమాదాల నివారణతో పాటు నగర సుందరీకరణకు భూగర్భ విద్యుత్ లైన్ పనులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, డీఈ పి.శ్రీనివాస్ ఏడీఈ జి.రామునాయుడు, ఏఈ నాగేశ్వరరావు, భూగర్భ విద్యుత్ లైన్ అధికారులు ఏడీఈ శ్రీనివాస్, అమీర్, ఏఈ రమణ, కార్పొరేటర్లు దాడి వెంకటరమేశ్, బొమ్మిడి రమణ, తదితరులు పాల్గొన్నారు.

# విలీన ప్రాంత వార్డులను అభివృద్ధి చేయడమే లక్ష్యం

» మేయర్ పీలా శ్రీనివాసరావు

» 93వ వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో మేయర్ పీలా, ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

వేపగుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వీలీన ప్రాంత వార్డుల్లో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. 93వ వార్డులోని పలు కాలనీల్లో రూ.2.19 కోట్ల నిధులతో కాలువలు, రోడ్లు, తదితర పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అనే ప్రాతిపాదికతో పనులను చేపట్టి వేగవంతంగా పూర్తి చేస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా దుర్గానగర్, కృష్ణా నగర్, సింహాద్రినగర్, ప్రహ్లాదపురం, విరాట్‌నగర్, శంకర్ ఫౌండేషన్, పోస్టల్ కాలనీ, శ్రీనివాస నగర్, వెంకటాద్రినగర్ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు, తదితర పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధులతో కూడా విలీన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, జడ్పీ కె.హైమావతి, ఎస్ఈ కె.శ్రీనివాసరావు, ఈఈ దిలీప్, డీఈ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విదేశాల్లో పూర్వ విద్యార్థి సంఘాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో పూర్వ విద్యార్థుల సంఘం ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. శనివారం సాయంత్రం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్), ఏయూ సంయుక్తంగా నిర్వహించిన ఎగ్జిట్ ఎంగేజ్‌మెంట్ ఈవెనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఏయూతో విదేశీ విద్యార్థుల ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకువచ్చిందన్నారు. కలిసి పనిచేయడం, ఆలోచనలు పంచుకోవడానికి మార్గం చూపిందన్నారు. పూర్వ విద్యార్థులందరూ విదేశాల్లో ఏయూ ఖ్యాతిని పెంచేలా పనిచేయాలని సూచించారు.

ఐసీసీఆర్ స్కాలర్‌షిప్ విభాగం డైరెక్టర్ సంజీవ్ వేది మాట్లాడుతూ ఏయూలో చదివిన విదేశీ విద్యార్థులు తమతో భారతీయతను తీసుకువెళుతున్నారన్నారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్, రిజిస్ట్రార్ ఆచార్య ఈ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ 59 దేశాల నుంచి 1,100 మంది విదేశీ విద్యార్థులు ఏయూలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఐసీసీఆర్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం అసోసియేట్ డీన్ ఆచార్య ఎన్.ఎం.యుగంధర్ పాల్గొన్నారు. ఏయూ, విశాఖ నగరం, తెలుగు ప్రజలతో తమ అనుబంధాన్ని విదేశీ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అలుమ్ని రికార్డులను ప్రదానం చేశారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.


పూజలందుకున్న జగన్నాథ, బలభద్ర, సుభద్ర

## కూర్మావతారంలో జగన్నాథుడు

అగనంపూడి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఇంద్రద్యుమ్ని మందిరంలో కొలువుదీరిన స్వామివారు శనివారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు సంతోశ్‌కుమార్ జగన్నాథ, బలభద్ర, సుభద్రలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో షిర్డీ సాయి సేవా సమితి ప్రతినిధులు లలితాసహస్ర నామ పారాయణాన్ని పఠించారు. కార్యక్రమంలో ఈవో పద్మావతి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, టీడీపీ 79వ వార్డు అధ్యక్షుడు కరణం జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి విరాళం

సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త తనకు వచ్చిన ఈ నెల పింఛన్ సొమ్ము రూ19,849ను కొండయ్యవలస రామాలయం అభివృద్ధికి విరాళంగా అందజేశారు. ఈ మేరకు గ్రామ పెద్దలకు చెక్కును అందించారు. అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల్లో రామ అప్పారావు చేస్తున్న సేవలను గ్రామ పెద్దలు కొనియాడారు. కార్యక్రమంలో ఐఆర్‌సీ హెచ్ అప్పారావు, బి.అప్పారావు, శ్రీను, సుశీల గజేంద్రరరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడికి ఆర్థిక సాయం అందజేత

అక్కిరెడ్డిపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గత నెల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయి మహర్షి కుటుంబానికి ఆటోనగర్ వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ సభ్యులు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాలనీకి చెందిన వరదాడ గోవింద ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ సభ్యుల నుంచి సేకరించిన ఈ నగదు మొత్తాన్ని మహర్షి తల్లిదండ్రులకు శనివారం అందించారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన వారికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు బొడ్డు రమణ, కామాడ రాంబాబు, వరదాడ వెంకటరమణ, ఎ.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## దివాలా–పరిష్కార ప్రక్రియపై సమావేశం

ఆటోనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో లఘు ఉద్యోగ భారతి జిల్లా చాప్టర్ మాజీ అధ్యక్షుడు అట్లూరు రమేశ్, పారిశ్రామికవేత్త ఏకే బాలాజీ ఆధర్యంలో శనివారం సాయంత్రం దివాలా-పరిష్కార ప్రక్రియ అనే అంశంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షిప్‌యార్డు మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.సుజాత, ఐటీ నిపుణులు విశ్వనాథశర్మ, నరేంద్రరెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు ఇబ్బందుల్లో ఉన్న తమ సంస్థల రుణాలను పరిష్కరించుకునేందుకు ఉన్న చట్టబద్ధమైన మార్గాల ద్వారా ప్రయత్నించే ప్రక్రియలను వివరించారు. దివాలా-పరిష్కార ప్రక్రియ గురించి, తాత్కాలిక రిజల్యూషన్ ప్రొఫెషనల్ నియామకం, రిజల్యూషన్ ప్లాన్, లిక్విడేషన్, తదితర అంశాలను వివరించారు. దివాలా ప్రక్రియలో పాటించాల్సిన నియమాలను వివరించి, పలువురి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం లఘు ఉద్యోగ భారతి జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగపతి రాజు, కార్యదర్శిగా పవన్ జైస్వాల్, కోశాధికారిగా వరుణ్, ఉపాధ్యక్షులుగా సర్వసిద్ధి సత్య, సంయుక్త కార్యదర్శిగా నాగిరెడ్డి, తదితరులు ఎంపికయ్యారు.

## 87వ వార్డును స్మార్ట్‌గా తీర్చిదిద్దుతా: కార్పొరేటర్ బొండా జగన్

కూర్మన్నపాలెం, జూన్28 (ఆంధ్రజ్యోతి): తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వార్డును స్మార్ట్‌గా తీర్చిదిద్దుతానని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వార్డు పరిధిలోని అప్పికొండ కాలనీ, శెట్టిబలిజ వీధిలో శనివారం సామాజిక భవనాలు, ప్రహరీలు, డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణ పనుల శంకుస్థాపనలో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్డులోని ప్రజలందరికీ మౌలిక వసతులను కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, లక్కరాజు సోంబాబు, ఎ.సూర్యనారాయణ, ఎస్.కనకరాజు, రాజన్‌రాజు, ప్రకాశ్, ఎస్.పెంటారావు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

## 'పర్యావరణ పరిక్షణకు కృషి చేయాలి'

గోపాలపట్నం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిక్షణ కోసం అందరూ బాధ్యతగా కృషి చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కోరారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విత్తన బంతుల తయారీ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన తయారీ కార్యక్రమాన్ని పరిశీలించి జేడీ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఏడాది 25 వేల విత్తన బంతులను తయారు చేయడం జరుగుతుందన్నారు. ఏటా వర్షాకాలంలో మైదాన, కొండవాలు ప్రాంతాల్లో విత్తన బంతులను చల్లుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి కె.అను, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, వేణుగోపాల్, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు ముజ్జూరి శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

పెదగంట్యాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, క్రీడాకారులకు అన్ని వసతులను కల్పిస్తుందని కార్పొరేటర్లు బి.నరసింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు అన్నారు. 65వ వార్డు పరిధి వికాస నగర్ రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో రూ.9 కోట్లతో ఆధునీకరించిన వసతులను శనివారం వారు పరిశీలించారు. వ్యాయామశాల, షటిల్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్, యోగా కేంద్రంలో క్రీడాకారుల సందడి కనిపించింది. జాతీయ యోగాసన రిఫరీ శ్రీనివాస్ పర్యవేక్షణలో శనివారం శాంతి యోగా శిక్షణ తరగతులను నరసింహపాత్రుడు ప్రారంభించారు. కార్యక్రమంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, నాయకుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### సినిమా గైడ్

● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),

● **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,

● **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,

● **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 18, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది) 50, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, క్యాప్సికమ్ 86, కీరదోస 34, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడుచిక్కుడు 56, గోరుచిక్కుడు 40, కూరపెండలం 30, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)**
(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 580 |
| విజయనగరం | 584 |
| శ్రీకాకుళం | 584 |

**చికెన్ ధరలు**
బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 80 |
| లైవ్ ధర | 100 |
| విత్ స్కిన్ | 170 |
| స్కిన్‌లెస్ | 180 |

# దొడ్డిదారిన స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ

- సెయిల్‌లో విలీనం చేస్తేనే ప్రయోజనం
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును విభాగాల వారీగా ఆపరేషన్, నిర్వహణను కాంట్రాక్టుకు ఇచ్చేస్తూ దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేస్తున్నదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. డాబాగార్డెన్స్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావులు మాట్లాడారు. ప్లాంటులో మొత్తం 13 విభాగాలు ఉండగా వాటిలో మార్కెటింగ్ విభాగాన్ని ఇప్పటికే ప్రైవేటు సంస్థకు అప్పగించారని ఆరోపించారు. తాజాగా అతి ముఖ్యమైన రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు, సింటర్ ప్లాంట్లకు టెండర్లు ఆహ్వానించారన్నారు. ఇలా అప్పగించడం వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు, కార్మికులు ఉత్పత్తిలో భాగస్వామ్యం ఉండదని, కాంట్రాక్టర్లు వారి లాభాల కోసమే స్టీల్‌ప్లాంటును నడిపిస్తారన్నారు. ఇది సరైన విధానం కాదని ఖండించారు. కొత్త కాంట్రాక్టర్లు ఇతర రాష్ట్రాల కార్మికులను పనిలోకి తీసుకుంటే తాము అంగీకరించబోమని, ఇప్పటివరకు పనిచేసి తొలగింపునకు గురైన వారినే తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంటును ఆధునిక జైలుగా మార్చేశారని, భోజన విరామ సమయంలోనూ సమ్మెకు మద్దతుగా సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. విభాగాల ప్రైవేటీకరణ ఆపి, ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సొంత గనులు కేటాయించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు, పక్కన ఆదినారాయణ, శ్రీనివాసరావు, రామచంద్రరావులు

# అప్పన్నను దర్శించుకున్న మంత్రి పార్థసారథి

సింహాచలం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓలు ఎన్. ఆనందకుమార్, సింగం రాధ అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలు అందజేయగా ఏఈఓ శాలువతో సత్కరించి, స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.



కప్ప స్తంభం వద్ద మంత్రి పార్థసారథి

# 'పీవీ చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి'



పీవీ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఇతర ప్రముఖులు

సీతంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భారత రత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అభిప్రాయపడ్డారు. పీవీ 104వ జయంతిని పురస్కరించుకొని విశాఖ పౌరగ్రంథాలయంలో మల్లంపల్లి సోమశేఖర శర్మ, చారిత్రక అధ్యయన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రచయిత శంకర్‌నీలు భాగవతులు రచించిన 'పీవీ జీవిత చరిత్ర, పి.వి. నరసింహారావు-భారతజాతి పునరుజ్జీవ శక్తి' పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ అందరి ప్రశంసలు పొందిన అపర చాణుక్యుడు, రాజనీతిజ్ఞుడు పీవీ అని కొనియాడారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ తెలుగు వారంతా పీవీ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో సులక్షణాలు కలిగిన వ్యక్తి పీవీ అన్నారు. పుస్తక రచయిత శంకర్‌నీలు భాగవతులు మాట్లాడుతూ పీవీ గొప్పతనాన్ని తెలియచేయడం కోసం తెలుగులో ఆయన జీవిత చరిత్ర రాశానన్నారు. ఆయన జీవిత చరిత్రను ఆగ్లంలో అనువదించిన డాక్టర్ కె.సత్యనారాయణ మూర్తి, పూర్వ వీసీ ఆచార్య డాక్టర్ బాల మోహన్‌దాస్, పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ అధికారి విజయ్ భాస్కర్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, పలువురు మేధావులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్‌లో సీనియర్ డీసీఎం తనిఖీలు

- టిక్కెట్ తీసుకోని ప్రయాణికుల నుంచి రూ.11 లక్షల అపరాధ రుసుము వసూలు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పూరి జగన్నాథుని రథయాత్ర రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడంలో భాగంగా వాల్తేరు రైల్వే డివిజన్ అంతటా ప్రత్యేకంగా భద్రత, సౌకర్యాల నిర్వహణతోపాటు టికెట్ తనిఖీల డ్రైవ్ చేపట్టారు. ఈ నేపథ్యంలో సీనియర్ డీసీఎం కె.సందీప్ శనివారం విశాఖ రైల్వే స్టేషన్ సహా పలు స్టేషన్లలో ప్రయాణికుల సదుపాయాలు పరిశీలించి రైళ్లలో టికెట్ తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లోని వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫామ్‌లపై క్యాటరింగ్ స్టాల్స్, రైళ్లలో ప్యాంట్రీ కార్‌లలో పాటిస్తున్న నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్లలో తాగునీటి సదుపాయం నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విశాఖ-విజయనగరం మార్గంలోని కొన్ని రైళ్లలో తనిఖీలు చేసి టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న 1,850 మంది నుంచి సుమారు రూ.11 లక్షల జరిమానా వసూలు చేశారు. టికెట్ లేకుండా ప్రయాణించడం, మండే వస్తువులను తీసుకువెళ్లడం ప్రమాదంతోపాటు నేరమని, టికెట్ తనిఖీ సిబ్బంది అడిగినపుడు తప్పనిసరిగా సరైన గుర్తింపు కార్డులు చూపించాల్సి ఉందని, అలాగే క్యూఆర్ కోడ్ ఆధారిత సౌకర్యం వినియోగించుకుని డిజిటల్ ద్వారా టికెట్ చార్జీలు, ఇతరత్రా చెల్లింపులు చేయాలని సీనియర్ డీసీఎం సందీప్ స్పష్టం చేశారు.



తనిఖీ చేస్తున్న సీనియర్ డీసీఎం సందీప్

# నలుగురికి ఎస్ఐలుగా పదోన్నతి

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌లో నలుగురు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ గోపినాథ్ జట్టీ ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందిన బి. సురేష్‌కు పార్వతీపురం మన్యం జిల్లా, డి. సత్యారావును శ్రీకాకుళం, కె. శ్రీనివాసరావు, సర్థార్‌ఖాన్‌కు విజయనగరం జిల్లాకు కేటాయించారు. పదోన్నతి పొందిన నలుగురికి డీఐజీ అభినందించారు. కొత్తగా ఎస్సైగా పదోన్నతి పొందిన సర్థార్‌ఖాన్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు.



పదోన్నతి పొందిన ఎస్సైతో డీఐజీ గోపినాథ్ జట్టీ

# ఇండియా సైన్స్ మ్యాప్‌లో వైజాగ్ క్లస్టర్

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇండియా సైన్స్ మ్యాప్‌లో విశాఖపట్టణాన్ని ఏపీ మెడ్‌టెక్ జోన్ చక్కటి స్థానంలో నిలిపిందని జోన్ సీఈఓ జితేంద్ర శర్మ పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వయిజర్ ప్రొఫెసర్ అజయ్ సూద్ మెడ్‌టెక్ జోన్‌లోని వైజాగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్‌ను దేశంలో ఎనిమిదో ఇన్నోవేషన్ సెంటర్‌గా ప్రకటించారన్నారు. 2024లో ప్రారంభమైన వైజాగ్ క్లస్టర్ చిన్నదే అయినప్పటికీ టెక్నాలజీ, ఆటోమేషన్, ఈ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాల్లో తనదైన ప్రత్యేకత చాటిందన్నారు. నేషనల్ మెటలర్జీ లేబరేటరీ సహకారంతో అభివృద్ధి చేస్తున్న ఈ-మెషినరీ వ్యర్థాల రీసైక్లింగ్‌కు ఉపకరిస్తోందన్నారు. మెడ్‌టెక్ జోన్ పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందిస్తున్నదని వివరించారు.



మెడ్‌టెక్ జోన్ బ్రోచర్‌ను అందిస్తున్న జితేంద్ర శర్మ